ప్రజాశక్తి
బుధవారం 20 డిసెంబర్ 2023 8 పేజీలు
ప్రకాశం బాపట్ల





అంగన్‌వాడీల వంటా వార్పు



ఒంగోలు కలెక్టరేట్ వద్ద వంటా వార్పు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

- రోడ్లపై వంట చేస్తూ నిరసనలు
- బాపట్లలో చిలుక జోస్యం చెప్పించుకొని నిరసన
- నగరంలో పొర్లు దండాలు
- ఎనిమిదోరోజుకు చేరిన సమ్మె

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

అంగన్‌వాడీల సమ్మె మంగళవారం నాటికి ఎనిమిదో రోజుకు చేరింది. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు ప్రాజెక్టు కార్యాలయాల వద్దకు చేరిపెద్ద ఎత్తున సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. అంగన్‌వాడీ కేంద్రాలు స్తంభించిపోయాయి. అయినా రాష్ట్ర ప్రభుత్వం వీరిపట్ల ఇంకా సానుకూలంగా స్పందించడం లేదు. కేంద్రాలను మూసేసి సిఎం జగన్ ఇచ్చిన హామీ అమలు చేయనందునే అనివార్యంగా సమ్మె చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమ్మెను నివారించేదిశగా ఆలోచన చేయడంలేదు. తాడేపల్లి సిఎం కార్యాలయం ఇపుడు అభ్యర్థులను ఎంపిక చేసేపనిలో వాడివేడిగా ఉంది.అంతా రాజకీయ వ్యవహారాలు తప్ప జనం సమస్యలు పట్టేలా లేవు. అందుకే అంగన్‌వాడీల సమ్మె ఎవరికీ పట్టలేదు. వాళ్లే చేసుకుంటారులే అనే భావనే కనిపిస్తోంది. ఇంకా చెప్పాలంటే పంతానికి వెళ్లినట్లు కనిపిస్తోంది. అన్ని ప్రాజెక్టు కార్యాలయాల వద్ద సమ్మె కొనసాగుతోంది. మంగళవాడు సమ్మె చేస్తున్న కార్యాలయాల వద్దనే వంటా వార్పుతో నిరసన చేపట్టారు. రోడ్లపై స్టవ్‌లు పెట్టిపెద్ద పెద్ద గిన్నెలతో వంటలు చేశారు. అక్కడే భోజనం చేశారు. ఒంగోలు కలెక్టరేట్ వద్ద వంటావార్పు చేపట్టారు. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో చేపట్టారు. కనిగిరి, మార్కాపురం కేంద్రా ల్లోనూ పెద్దఎత్తున ఈ కార్యక్రమాలు జరిగాయి. రెవెన్యూ డివిజన్ కార్యాలయాలను సోమవారం ముట్టడించారు. వివిధ రూపాల్లో నిరసనలు చేపట్టారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టి నట్లుగా కూడా లేదు. ఇపుడు సమ్మె ఎనిమిదో రోజుకు చేరింది. అంగన్‌వాడీలు ఐక్యంగా పట్టు వదలకుండా సమ్మె చేస్తున్నారు. తాడోపేడో తేల్చు కునేందుకు సిద్ధ మయ్యారు. ఎన్నికల సమ యంలో ఇలాంటి చిన్నచిన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలనే ఆలోచన కూడా ప్రభుత్వం చేయడం లేదు. మరోవైపు జిల్లా మంత్రి, ఇన్‌ఛార్జ్ మంత్రి, ఎమ్మెల్యేకు పట్టలేదు. ఎందుకంటే వారికి ఎన్నికల వ్యవ హారాలు తప్ప మరేమీ పట్టడం లేదు.పైగా ఇపుడు సిట్టింగ్ స్థానాల్లో మంత్రులు ఇద్దరికీ టిక్కెట్లు లేవు. వేరేస్థానాలకు బదిలీఅయ్యారు. దీంతో ఆ గొడవల్లో ఉన్నారే తప్ప అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన చేసే తీరిక కూడా వీళ్లకు కనిపించడం లేదు. ఎన్నికల్లో పాలకపక్షానికి బుద్ధి చెప్పాలనే భావన ఇపుడు అంగన్‌వాడీల్లో పెరుగుతోంది. గత ప్రభుత్వం మాదిరిగానే జగన్ ప్రభుత్వం కూడా వ్యవ హరిస్తోందన్న విమర్శలు తీవ్ర మవుతున్నాయి. ఇప్పటికైనా అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేసే దిశగా ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరముంది.

కలెక్టరేట్ వద్ద వంటా వార్పు

ఒంగోలు కలెక్టరేట్ : తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారమూ కొనసాగింది. సమ్మె భాగంగా కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీ మంగళవారం వంటా - వార్పు నిర్వహించి నిరసన తెలిపారు. అక్కడే భోజనం చేశారు. ఈ కార్యక్రమానికి యూనియన్ నాయకులు కె.శ్రీదేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కరించడంలో కాలయాపన చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించకపోతే ప్రజా సంఘాలను కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఎఐఎఫ్‌టియు జిల్లా నాయకులు ఎంఎస్. సాయినాథ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్స్ సమ్మెకు ప్రకాశం జిల్లా కమిటీ తరపున పూర్తి సంఘీభావం ▶ 2లో



బాపట్లలో చిలుక జోస్యం చెప్పించుకుంటున్న అంగన్‌వాడీలు



బాపట్ల జిల్లా నగరంలో పొర్లుదండాలు పెట్టి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

పశ్చిమాన మాజీ మంత్రి శిద్దాకు అవకాశం

- మార్కాపురం లేదా గిద్దలూరులో పోటీకి పరిశీలన
- వైపాలెంలో తాటిపర్తి చంద్రశేఖర్‌కు జిల్లానేత సిఫారసు
- కనిగిరి, గిద్దలూరులోనూ మార్పులకు అధిష్టానం ఆలోచన



ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

మాజీ మంత్రి శిద్దా రాఘవరావును పశ్చిమాన ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేయించేందుకు వైసిపి అధిష్టానం ఆలోచన చేస్తుంది. సిట్టింగుల పనితీరుపై సానుకూలమైన నివేదికలు లేనందున అభ్యర్థుల మార్పులు అనివార్యమంటున్నారు. ఇందులో భాగంగా అన్నికోణాల్లో బలమైన నేతగా ఉన్న మాజీ మంత్రి శిద్దా పేరు అధిష్టానం పరిశీలనలో ఉంది. ఆయన తొలి నుంచి దర్శి టిక్కెట్ ఇవ్వాలని కోరుతున్నారు. అక్కడ దాదాపుగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి ఖరారైనట్లు చర్చ సాగుతోంది. బూచేపల్లి నేరుగా సిఎం జగన్‌ను కలిసి టిక్కెట్ ఖరారు చేయించుకున్నారనే ప్రచారంఉంది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావుకు గిద్దలూరు లేదా మార్కాపురం నియోజకవర్గాల్లో ఏదో చోట అవకాశం కల్పించాలని భావిస్తున్నారు. ఈ రెండు నియోజక వర్గాల్లో శిద్దా సామాజికవర్గం ఓట్లు గణనీయంగానే ఉన్నాయి. ఈతరుణంలో ఈ రెండు స్థానాల్లో ఒకచోట ఇవ్వాలనే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు చర్చ సాగుతోంది. మరోవైపు మాజీ మంత్రి బాలినేని కూడా తొలి నుంచి మాజీమంత్రి శిద్దా రాఘవరావుకు జిల్లాలో ఏదోస్థానంలో టిక్కెట్ ఇవ్వాలని కోరుతున్నారు. అదేవిధంగా వైసిపిలో చేరిన సీనియర్ నేత కరణం బలరాంకూ టిక్కెట్ ఇవ్వాలని గట్టిగా పట్టు పడుతున్నారు. సిఎం జగన్ దృష్టికి వీరిద్దరికి టిక్కెట్లు ఇవ్వాలనే విషయాన్ని గతంలో కూడా తీసుకుపోయారు. పార్టీకో ఆర్డినేటర్‌తోనూ ఇదే అంశాన్ని పలుసార్లు చర్చించారు. అయితే ఇపుడు మార్పులుచేర్పుల్లో శిద్దా రాఘవరావుకు పశ్చిమాన అవకాశం కల్పించేందుకు పరిశీలన జరుగుతోంది. కరణం బలరాంకు ఈపాటికే చీరాల టిక్కెట్ ఖరారైంది. సర్వేల నివేదికల ఆధారంగా పర్చూరు పేరు కూడా తాజాగా వినిపిస్తోంది. దీనిపై కొంత స్పష్టత రావాల్సి ఉంది. అద్దంకికి కొత్త సమన్వయకర్త హనిమిరెడ్డి ఈపాటికే నియోజకవర్గంలోకి అడుగుపెట్టారు. పోటీకి సన్నాహాల్లో ఉన్నారు. వైపాలెం నియోజకవర్గం నుంచి మంత్రి సురేష్ కొండపికి వచ్చారు. అక్కడ తాటిపర్తి చంద్రశేఖర్‌ను మాజీ మంత్రి బాలినేని సిఫార్సు చేస్తున్నారు. సర్వేల ఆధారంగా అధిష్టానం ఇక్కడ అభ్యర్థి ఎంపికపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. మంత్రి ఆదిమూలపు సురేష్‌తోనూ చర్చించాల్సి ఉంది. కనిగిరి అభ్యర్థి మార్పుపై కూడా చర్చ నడుస్తోంది. కనిగిరి ఎమ్మెల్యేపై పార్టీలోని ముఖ్యనేతలు ఫిర్యాదు చేస్తున్నారు. హైదరాబాదు వెళ్లి పార్టీ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డికి కనిగిరి నేతలు బాలినేని సమక్షంలోనే ఫిర్యాదు చేశారు. ఇక్కడా స్పష్టత రావాల్సి ఉంది. పార్టీలోపలా వెలుపలాఎన్ని చర్చలు సాగినా బాలినేని ఒంగోలు నుంచి పోటీ అనివార్యం. ఈవారంలోనే జిల్లా నేతలను తాడేపల్లి పిలిచి మిగతా స్థానాలపై తుది నిర్ణయం తీసుకోవచ్చని సమాచారం.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

యువత వ్యాపార రంగంలో రాణించాలి

▲ 8లో



రవికిరణ్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న విక్టర్ ప్రసాద్

విద్యార్థి మృతికి కారకులైన ఉపాధ్యాయులపై చర్యలు

రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్

▲ 8లో

అంగన్‌వాడీల వంటా వార్పు

(మొదటి పేజీ తరువాయి)

తెలియజేస్తున్నామన్నారు. ఎపి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.నాగేశ్వర్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్‌వాడీ పోరాటం విజయవంత కావాలని, వారికి కనీస వేతనాలు. కార్మిక చట్టాలు అమలు చేయాలన్నారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురాం మాట్లాడుతూ గ్రామాల్లో బడుగు బలహీన వర్గాల ప్రజలు, బాలింతలు, చిన్న పిల్లలకు సంరక్షణగా ఉన్న అంగన్‌వాడీల సేవలు మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు తంగిరాల మహేష్, సిహెచ్. రాంబాబు, నగర ఉపాధ్యక్షులు తంబి శ్రీనివాసులు, ఎస్‌డి. హుస్సేన్, యూనియన్ నాయకులు కెవి సుబ్బమ్మ, కె.ప్రశాంతి, హేమిమా ,సిహెచ్.జ్యోతి, శ్రీదేవి, నిర్మల, పద్మ, సంధ్యా రాణి, శేషమ్మ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

బాపట్లలో చిలుక జోస్యం చెప్పించుకున్న అంగన్‌వాడీలు

బాపట్ల: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు 8వ రోజూ సమె8చేపట్టారు. ఈ సమ్మెకు వివిద ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు చిలుక జోస్యం చెప్పించుకున్నారు. ఈ సందర్భంగా బాపట్ల ఐసిడిఎస్ ప్రాజెక్టు అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు శైలశ్రీ మాట్లాడుతూ అంగన్‌వాడీలు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ఉద్యమం ఆగదన్నారు. సమ్మెకు సంఘీభావం తెలిపిన వారిలో సిఐటియు జిల్లా కోశాధికారి భోగిరెడ్డి తిరుమలరెడ్డి, ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మున్నంగి కుమార్, సిఐటియు నాయకులు శరత్ బాబు ఉన్నారు.

విద్యాభివృద్ధికి యుటిఎఫ్ కృషి

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

విద్యాభివృద్ధికి యూటీఎఫ్ (ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్) కృషి అభినందనీయమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆర్ హనుమంతరావు, బి డేవిడ్, పీ పంతులు అన్నారు. విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు అయ్యేందుకు అవకాశం ఉండే విధంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిపుణుల చేత తయారు చేయించిన మోడల్ టెస్ట్ పేపర్‌లను దాతల సహకారంతో మండల యూటీఎఫ్ నాయకులు మంగళవారం విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఈ మోడల్ టెస్ట్ పేపర్లను వినియోగించుకుని శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించి యుటిఎఫ్ వారి కృషికి, దాతల సహకారానికి న్యాయం చేకూర్చాలన్నారు. పాఠశాల విద్యకు పూర్వ విద్యార్థులు సహకరించినందుకు యుటిఎఫ్ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జే వెంకట్రావు, షేక్ పాదుషా, గౌరవ అధ్యక్షులు గోదాసు వేమ నారాయణ, నాయకులు వి సాంబశివరావు, ఎన్ తిరుపతయ్య, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జి వెంకటేశ్వర్లు, జి రవిబాబు, ఎం కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలి: యుటిఎఫ్

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, డిఎ, పిఆర్సి బకాయిలు వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందించే కార్యక్రమంలో భాగంగా గిద్దలూరు యుటిఎఫ్ కార్యాలయంలో ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షణ ఉద్యోగుల నిరవధిక సమ్మెకు యుటిఎఫ్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాదు, గౌరవ అధ్యక్షులు కొమ్మోజి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి రమణారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సత్యనారాయణరెడ్డి, కోమరోలు, రాచర్ల, గిద్దలూరు మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

తుపాను అనంతరం చర్యలపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-పొదిలి: తుపాను అనంతరం పొగాకు రైతులు తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం మర్రిపూడి మండలం కెల్లంపల్లి గ్రామంలో స్థానిక వేలం కేంద్ర నిర్వహణాధికారి జి గిరి రాజకుమార్ అధ్యక్షతన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఐటిసి క్రాప్ అభివృద్ధి మేనేజర్ జి వెంకటేష్, సీనియర్ గ్రేడింగ్ అధికారి మేడా కిరణ్, ఫీల్డ్ అఫీసర్ జి రవి బాబు, సిబ్బంది దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

మండలంలోని రేగులచెలక రెవెన్యూ రికార్డులను మండల రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు. రేగులచెలక రెవిన్యూలో పలు సర్వే నెంబర్లలోనీ భూములకు పలువురు అక్రమంగా పట్టాలు పుట్టించి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయా సర్వే నెంబర్లపై విచారణ చేపట్టి అక్రమాలను నివారించాలని గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేసి వున్నారు. ఈ ఫిర్యాదుపై విచారణ చేపట్టిన అధికారులు అక్రమాలు చోటు చేసుకున్న సర్వే నెంబర్లను మాత్రమే కాకుండా గ్రామ రెవెన్యూ రికార్డు మొత్తాన్ని వెబ్ లాండ్ క్లోజ్ చేశారు. వెబ్ లాండ్‌ను ఓపెన్ చేసి ఇబ్బందులు తీర్చాలంటూ రైతుల అభ్యర్థనలకు స్పందించిన అధికారులు మంగళవారం గ్రామ సచివాలయంలో గ్రామసభ నిర్వహించి రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. అభ్యంతరాలు లేని సర్వే నెంబర్లను ఓపెన్ చేయనున్నట్లు రెవెన్యూ అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు ఎం సలోమి, ఆర్ఐ శ్రీధర్ బాబు, వీఆర్వో నాగరాజు, రైతులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యుత్ సిబ్బంది

విద్యుత్‌ను ఆదా చేయాలి

ప్రజాశక్తి-దర్శి: ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను ఆదా చేసి భవిష్యత్తు తరాలకు ఉపయోగపడాలని విద్యుత్ శాఖ ఈఈ ఎస్‌కే కరీం అన్నారు. మంగళవారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఇంధనాన్ని పొదుపు చేయాలని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఈ పిచ్చయ్య, ఏఈలు వేణుగోపాల్, బ్రహ్మం, సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీ

ప్రజాశక్తి-కొనకనమిట్ల

కొనకనమిట్ల మండల పరిషత్ అభివృద్ధి అధికారి చిన్నారికట్ల గ్రామ సచివాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. గర్భిణులకు వచ్చిన కిట్లను లబ్ధిదారులను పిలిపించి ఇచ్చారు. అంగన్‌వాడీ పిల్లలకు భోజనం వసతులు పరిశీలించారు. ఆరోగ్యశ్రీ కార్డ్స్ ఈ కేవైసీ చేసి పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

ఉద్యోగుల 'సమగ్ర' నిరసన

ప్రజాశక్తి-కంభం

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు మంగళవారం ఒంటి కాలిపై నిలుచుని నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 16 నుంచి 19 వరకు పెన్‌డౌన్ చేసి నిరసన వ్యక్తం చేశారు. విద్యా సంబంధిత వ్యాపకాలకు దూరంగా ఉండి తమ ఆవశ్యకతను చాటిచెప్పారు. సమస్యలు తీరని పక్షంలో సమ్మె బాట తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్‌లు, పార్ట్ టైం ఉపాధ్యాయులు, ఐఇఆర్‌టిలు పాల్గొన్నారు.

సిఎస్ పురంరూరల్: మండలంలోని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ డిమాండ్ల సాధన కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన పెన్ డౌన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ప్ల కార్డులు ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు. బుధవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు వారు తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్‌ఆర్ పాలసీ ఇవ్వాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్పీలు, ఎంఐఎస్ డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐఈఆర్టిలు పాల్గొన్నారు.



కంభంలో ఒంటికాలిపై సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల నిరసన

పెద్దదోర్నాల: సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన పెన్‌డౌన్ దీక్ష మంగళ వారం నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెగ్యులైజేషన్, హెచ్‌ఆర్ పాలసీ, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, వేతనంతో కూడిన మెడికల్ లీవ్, చైల్డ్ కేర్ లీవ్, పితృత్వ సెలవులు ఇవ్వాలని కోరారు. ఉద్యోగులు ఈ దీక్షలో పాల్గొన్నారు.

దర్శి: సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని యూటీఎఫ్ మండల అధ్యక్షులు మీనిగ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలోని అంబేద్కర్ భవనం వద్ద సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు సమ్మెకు మద్దతుగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ధనిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు యలమందరెడ్డి, నాగేశ్వరరావు, కాశిం, కామిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రామిరెడ్డి, తిరుపతిస్వామితో పాటు ఎస్ఎస్‌ఏ ఉద్యోగులు చంద్రం, కోటేశ్వరరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: ఎస్ఎస్‌ఏ రాష్ట్ర జేఏసీ ఆదేశాల మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత 16వ తేదీ నుంచి 19 వరకు పెన్ డౌన్ కార్యక్రమం నిర్వహించి, 20 నుంచి సమ్మె బాట పట్టనున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు బేస్తవారిపేట ఎంఆర్సీ వద్ద సీఐటీయూ తమ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు కల్పన మాట్లాడుతూ ఎస్ఎస్‌ఏ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఎస్ఎస్‌ఏ ఉద్యోగులు మాట్లాడుతూ శ్రమ దోపిడీని అరికట్టి తమను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ కంబం కన్వీనర్ షేక్ అన్వర్, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలను జయప్రదం చేయండి

జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి జయప్రకాష్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ సహకారంతో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21న మండల, పట్టణ స్థాయిలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ జయప్రకాష్ ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో నిర్వహించిన పాఠశాల స్థాయి పరీక్షలలో ప్రతి తరగతిలోనూ మొదటి స్థానం పొందిన విద్యార్థులను ఎంపిక చేసి ముగ్గురు విద్యార్థులను ఆ పాఠశాల జట్టుగా ఈనెల 21న నిర్వహిస్తున్న మండల, పట్టణ స్థాయి చెకుముకి సైన్స్ పరీక్షలకు పంపాలన్నారు. మండల, పట్టణ స్థాయిలో ఈ నెల 21న, జిల్లా స్థాయిలో 2024 జనవరి 7న, రాష్ట్రస్థాయిలో ఫిబ్రవరి 10,11 తేదీలలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పుల్లలచెరువు: పుల్లలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను మంగళవారం నిర్వహించారు. ఈ ప్రదర్శనను మండల విద్యాశాఖాధికారి-2 ఇందిరాప్రసాద్ ప్రారంభించారు. ఈ ప్రదర్శనను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం ఉమామహేశ్వరరావు, సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, రాఘవరెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ ప్రదర్శనకు మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని ప్రాథమిక పాఠశాల బాలబాలికలు ఈ ప్రదర్శనకు హాజరై విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను, మోడల్స్‌ను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. ఉత్తమ ప్రదర్శనలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు.

కనిగిరి: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కనిగిరి మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఈ నెల 21వ తేదీ కనిగిరి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని జనవిజ్ఞాన వేదిక కనిగిరి మండల ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ పరీక్షలకు కనిగిరి మండలంలోని 14 ప్రభుత్వ, 13 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నారు. 8,9,10వ తరగతి చదువుతూ పాఠశాల స్థాయిలోజరిగిన పరీక్షలో విజేతలైన విద్యార్థులు మండల స్థాయి పోటీలకు హాజరవుతున్నారని ఆయన అన్నారు.

పొదిలి: విద్యార్థులు అన్నిరంగాలలో రాణించి వారి ప్రతిభా పాటవాలను ప్రదర్శించడం ద్వారా సమాజ అభివృద్ధికి దోహదపడాలని మండల విద్యాశాఖ అధికారి ఎం శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మొత్తం 10 పాఠశాలల నుంచి 35 సైన్స్ ప్రదర్శనలు వచ్చాయి.

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-దర్శి: రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కార్డులో వైద్యాన్ని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచడంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని దర్శి కమిషనర్ మహేష్ అన్నారు. మంగళవారం ఐదో సచివాలయం వద్ద వైద్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్యశ్రీ కార్డులపై ప్రజలకు అవగాహన కల్పించారు. గతంలో ఐదు లక్షలు ఉన్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డును ఇప్పుడు రూ.25 లక్షలకు పెంచాలరని, దీనిని ఉపయోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ కార్డులు పలువురికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుక్రునాయక్, జేసీఎస్ పట్టణ కన్వీనర్ ఎదురు కోటిరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, ఆశా వర్కర్లు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

గ్రూపు-2కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- ఒగోలు సబర్బన్: గ్రూపు-2, కానిస్టేబుల్ ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు లాజిక్ అకాడమీ డైరెక్టర్ పాలపర్తి విజయభాస్కర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, జిడి అండ్ సిఆర్‌పిఎఫ్ విభాగాల్లో 24,678 భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో యువత ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 9985839758 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

గొర్రెల కాపరుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కొమరోలు: గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలని జిఎంపిఎస్ జిల్లా అధ్యక్షులు బొడ్డు రామరాజు కోరారు. మంగళవారం మండలంలోని నల్లగుంట్ల గ్రామంలో గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ సిబ్బంది వెల్ఫేర్ అసిస్టెంట్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొడ్డు రామరాజు మాట్లాడుతూ పశువుల బీమా పథకం పునరుద్ధరించాలని, 50 శాతం సబ్సిడీ రుణాలను ఇవ్వాలని కోరారు. తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం నాయకులు రమణయ్య, మెట్ల శ్రీనివాసులు, మారయ్య, మస్తాన్, కాసిం పీరా, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో టిడిపిదే విజయం: కందుల

ప్రజాశక్తి-మార్కాపురం

వైసిపి పాలనలో విసుగు చెందిన ప్రజలు వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టబోతున్నారని మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జవహర్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన టిడిపి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు మరింత కష్టపడాలని సూచించారు. ఇంటింటికీ తిరిగి ప్రజల కష్టాలు తెలుసుకోవాలని అన్నారు. పార్టీ అధినేత, మాజీ సిఎం చంద్రబాబునాయుడు ఎన్నికల మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో ఎలాగూ టిడిపి అధికారంలోకి రాబోతోందని, మార్కాపురంలోనూ మనం గెలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కష్టపడ్డ వారిని గుండెల్లో పెట్టుకుంటానని చెప్పారు. మార్కాపురం నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో వైసిపి గెలవదనే భయంతో ప్రత్యర్థులు తనకు జరిగిన



మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

ప్రమాదాన్ని కూడా వక్రీకరిస్తున్నారన్నారు. చంద్రబాబు కలిసేందుకు చేతికర్ర లేకుండా నాలుగు అడుగులు వేశానని అన్నారు. టిడిపి కార్యక్రమాల్లో కుర్చీలో కూర్చుంటారని, అక్కడ నడుస్తున్నారని కామెంట్లు చేయడం బాధగా ఉందన్నారు. తాను ప్రమాదంలో చచ్చి బ్రతికానన్నారు. అంతటి ప్రమాదంలో తన కాళ్ళు, శరీరంలోని ఇతర భాగాల్లోని ఎముకలు విరిగాయన్నారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నట్లు తెలిపారు. దీన్ని కూడా రాజకీయంగా వాడుకోవాలని చూడటం సిగ్గు చేటన్నారు. టిడిపి పోల్ స్ట్రాటజిస్ట్ అశోక్ మాట్లాడుతూ బూత్ స్థాయిలో పార్టీ కార్యకర్తలు ఏ రకంగా కష్టపడాలో వివరించారు. మీ పరిధిలోని ఓటర్లను ఏ రకంగా టిడిపి వైపు తిప్పుకోవాలో అవగాహన కల్పించారు. అనంతరం మార్కాపురం పట్టణంలోని 11వ వార్డుకు చెందిన 64 మంది యువకులు నాయుడు ఆధ్వర్యంలో మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరినీ పార్టీ కండువాలతో కందుల సాదరంగా ఆహ్వానించారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలి, ప్రధాన కార్యదర్శి కొప్పుల శ్రీనివాసులు, తర్లుపాడు మండల టిడిపి అధ్యక్షులు ఉడుముల చిన్నపరెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జునరావు, టిఎన్‌టియుసి ఆర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి డి మస్తానయ్య, మట్టం వెంకటేశ్వర్లు, పఠాన్ ఇబ్రహీం ఖాన్ పాల్గొన్నారు.

బస్సులో ఫోన్ మాయం

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

బస్సులో ప్రయాణిస్తున్న మహిళ పర్సుతో సహా స్మార్ట్ ఫోన్‌ను అపహరించిన ఘటన సోమవారం మార్టూరులో వెలుగు చూసింది. ఎస్ఐ ముసలం శ్రీనివాసరావు కథనం ప్రకారం.. కనిగిరి నుంచి విజయవాడ వెళుతున్న బస్సులో ఒంగోలుకు చెందిన శారద వలపర్లలోని బంధువుల ఇంటికి వెళ్లడానికి మార్టూరు వెళుతోంది. బొల్లాపల్లి వద్ద తన ఫోన్‌లో మాట్లాడిన మహిళ బస్సు మార్టూరు మార్కెట్ వద్దకు రాగానే ఫోన్ చేద్దామని చూస్తే పర్సు, అందులోని ఫోన్ కనబడకపోవడంతో ఆందోళన చెంది డ్రైవర్‌కు సమాచారం ఇచ్చింది. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ బస్సును ఆపి స్థానిక పోలీసులకు సమాచారమిచ్చారు. పర్సుతో పాటు అందులోని రూ.4 వేల నగదు చోరీకి గురైనట్లు మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి-కొత్తపట్నం

మండల పరిధిలోని ఈతముక్కల గ్రామానికి చెందిన కొండూరి రవణమ్మ(38) ఈ నెల 12న అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయం తెలిసిందే. తొలుత అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 15న పోలీసులు హత్య కేసుగా నమోదు చేశారు. అందులో భాగంగా ఎస్‌పి మల్లిక గర్గ్ ఘటనా స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. మృతురాలి బంధువులు, గ్రామస్తులతో మాట్లాడి జరిగిన ఘటపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఘటనా స్థలం ఆధారాలను జాగ్రత్తగా సేకరించి భద్రపరచాలని పోలీసు సిబ్బందికి సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కీలక ఆధారాలు సేకరించాలన్నారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ను రంగంలోకి దింపి కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌పి తెలిపారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. ఎస్‌పి వెంట అడిషనల్ ఎస్‌పి (క్రైమ్) శ్రీధర్‌రావు, ఒంగోలు డిఎస్‌పి నారాయణస్వామి రెడ్డి, ఒంగోలు టు టౌన్ సిఐ జగదీష్, ఒంగోలు వన్ టౌన్ సిఐ లక్ష్మణ్, ఒంగోలు రూరల్ సిఐ వి శ్రీనివాసరెడ్డి, కొత్తపట్నం ఎస్ఐ సాంబశివరావు తదితరులు ఉన్నారు.

కారు దొంగ అరెస్టు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం మూలగుంటపాడులోని గాంధీ రోడ్ నివాసం ఉంటున్న నేలపాటి బాల శంకర్ బాబుకు చెందిన కారు ఈనెల 15న చోరీకి గురైంది. దీంతో శంకర్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఒంగోలు డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డి పర్యవేక్షణలో శింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్ఐ శ్రీరామ్, సిబ్బంది కేసు దర్యాప్తు చేస్తున్నారు. అందులో భాగంగా శింగరాయకొండలోని కందుకూరు రోడ్డు వద్ద సోమవారం రాత్రి నిందితుడిని పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.12 లక్షల విలువైన కారును స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు జిల్లా గుడ్లూరు మండల మోచర్ల గ్రామానికి చెందిన మర్రిబోయిన వెంకట కౌశిక్ నిందితుడిగా గుర్తించారు. నిందితుడిపై ప్రకాశం, నెల్లూరు జిల్లా కావలి టౌన్ పోలీస్ స్టేషన్‌లో 12 చోరీ కేసులు నమోదైఉన్నాయి. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన శింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్ఐ టి శ్రీరామ్, పోలీసు సిబ్బందిని ఈ సందర్భంగా డిఎస్‌పి అభినందించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-దర్శి

మండలంలోని వెంకటాచలంపల్లి వద్ద కాశీనాయన ఆశ్రమంలో వెంకటేశ్వర్లు అనే అనాథ వృద్ధుడు మంగళవారం మృతి చెందగా ఆశ్రమ నిర్వాహకులు మానవత సభ్యులకు తెలిపారు. మానవత సభ్యులు ధనిరెడ్డి వెంకటరెడ్డి, కపరం శ్రీనివాసరెడ్డిలు ఆశ్రమం వద్దకు వెళ్లి అనాథ శవానికి దండవేసి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు టీచర్ వెంకటేశ్వరరెడ్డి, పాలెం లక్ష్మీరెడ్డి, ఆశ్రమ నిర్వాహకులు, అనాథులు, వృద్ధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.



అనాథ శవానికి పూలమాల వేస్తున్న ధనిరెడ్డి వెంకటరెడ్డి



జిఎస్‌టిపై అవగాహన కల్పిస్తున్న జమీర్

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎంబిఎ విద్యార్థులకు రోల్ ఆఫ్ జిఎస్‌టి ఇన్ ప్రోమోటింగ్ ఎంటర్ పెన్యుయర్ షిప్ అనే అంశంపై గెస్ట్ లెక్చర్ నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. చీరాల జిఎస్‌టి అధికారి ఎస్‌కె జమీర్ అహమ్మద్ ప్రసంగించారని ప్రిన్సిపాల్ ఎం వేణుగోపాలరావు తెలిపారు. ఎంబిఎ విద్యార్థులకు జిఎస్‌టిపై అవగాహన కల్పించారని ఎంబిఎ హెచ్ఒడి ఆర్ ఇమ్మానియేల్ తెలిపారు. జిఎస్‌టి ఉద్దేశాలను, దానిలో గల శ్లాబులను, డబుల్ టాక్సేషన్ నివారించడంపై అవగాహన కల్పించారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు జిఎస్‌టి క్రింద కల్పించిన మినహాయింపులు, ప్రోత్రాహకాలను వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. డాక్టర్ ఎస్ చాంద్ బాషా కన్వీనర్‌గా వ్యవహరించారు.



ఎస్ఎస్ఎ సిబ్బంది ఆందోళనకు యుటిఎఫ్ నేతల మద్దతు

ఎస్ఎస్ఎ సిబ్బందికి యుటిఎఫ్ మద్దతు

ప్రజాశక్తి - చీరాల

గత నాలుగు రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన పెండౌన్ నిరసనకు యుటిఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సమగ్ర శిక్ష తమ వంతు సహకారాన్ని అందిస్తామని అన్నారు. ఎంఈఓ కార్యాలయంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సేవలు హర్షనీయమని అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పి సురేష్, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్‌కె జానీ బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి కె శ్రీనివాసరావు, జిల్లా ఆడియట్ కన్వీనర్ సిహెచ్ వెలిగొండరెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎస్ఎన్ సుబ్బారెడ్డి, పి సీతారామరాజు, శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరరావు, జి సూరిబాబు పాల్గొన్నారు.

బాపట్ల : సర్వశిక్షా అభియాన్ సిబ్బంది సమ్మె బాట పట్టనున్నారు. పిట్టలవానిపాలెం మండలంలో సర్వ శిక్ష అభియాన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెన్ డౌన్ సమ్మెకు దిగుతున్నట్లు ఎంఇఒ ఉయ్యూరు వెంకటేశ్వరరావుకు సమ్మె నోటీసు మంగళవారం అందజేశారు. సర్వ శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమానవేతనం ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్, చైల్డ్ కేర్ లీవ్, పితృత్వ సెలవులతోపాటు పార్ట్ టైం ఉద్యోగులను ఫుల్ టైంలోకి మార్చాలని, గ్రాస్ పే అమలు చేయాలని, రూ.10లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యూటి అమలు చేయాలని, రిటైర్మెంట్ వయసు 62ఏళ్లకు పెంచాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరుతూ సమ్మె చేయనున్నట్లు తెలిపారు.

ఇంకొల్లులో నేత్రదానం

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్



వెంకట సుబ్బారావు(ఫైల్)

స్థానిక కొట్లబజారుకు చెందిన ఊటుకూరి వెంకట సుబ్బారావు (47) మృతి చెందగా కుటుంబ సభ్యులు నేత్రాలను దానం చేసేం దుకు ముందుకు వచ్చారు. శంకర నేత్రాలయం వైద్యులకు రోటరీ ప్రతినిధులు సమాచారం అందిం చారు. శంకర కంటి వైద్యులు వచ్చి కార్నియాలను సేకరిం చారు. నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులు పూర్ణచంద్రరావు, పుష్పలత, రాఘవేంద్రరావు, చంద్రలేఖ, నాళం లక్ష్మీ నారాయణను రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ మోహనరావు, జట్టి వెంకటేశ్వర్లు, క్లబ్ అధ్యక్షుడు కరి కమలేశ్వరరావు, కోశాధికారి చుండి సాంబశివరావు అభినందించారు.

అంగన్‌వాడీల డిమాండ్లపై ప్రభుత్వం దిగి రాకుంటే

కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం



చుండూరులో తాళాలు పగులగొట్టడాన్ని అడ్డుకున్న కార్యకర్తలు



రేపల్లెలో రోడ్డుపైనే అంగన్‌వాడీల వంటా వార్పు

ప్రజాశక్తి - రేపల్లె

అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె సందర్భంగా శిబిరం ఎదురు రోడ్డు మీదే వంట చేసి, అక్కడే భోజనాలు చేసి నిరసన తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్,హెల్పర్స్ కార్యదర్శి కె వాణి మాట్లాడుతూ ప్రభుత్వం రోడ్డున పడేసిన నేపథ్యంలో సమ్మె శిబిరాల వద్ద వంట చేసి తమ నిరసన తెలుపు తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం స్పందించక పోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తాము చేస్తున్న పనికి వేతనం అడగడం నేరమన్నట్లు ప్రచారం చేయడం దుర్మార్గమైన చర్యని అన్నారు. తమ సమస్యలు పరిష్కరించ కుండా నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని అన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగు తుందని హెచ్చరించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్, యూనియన్ జిల్లా అధ్యక్షు రాలు కె ఝాన్సీ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించకుంటే కలెక్టరేట్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. సిఐటియు నాయకులు కెవి లక్ష్మణరావు, కె ఆశీర్వాదం, కె రమేష్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు జ్యోతి, ఎన్ కృష్ణకుమారి, సునీత, నిర్మల, వై మేరీ, మణి పాల్గొన్నారు.

పర్చూరు : అంగన్‌వాడీల సమస్య పరిష్కారం అయ్యేవరకు తమ మద్దతు ఉంటుందని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ పేర్కొన్నారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె నుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించ కుండా ఉంటే బుధవారం నుంచి సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వంటా వార్పు చేసి అక్కడే భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి శంకరయ్య, నాయకులు బి చిన్నదాసు, కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భట్టిప్రోలు (చుండూరు) : అంగన్‌వాడి కార్యకర్తల డిమాండ్స్ నెరవేర్చాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె 8వ రోజుకు చేరింది. చుండూరు తహశీల్దారు కార్యాలయం వద్ద జరుగుతున్న అంగన్‌వాడీ సమ్మెకు టిడిపి, జనసేన పార్టీలు మంగళవారం మద్దతు తెలిపారు. ఎన్నికల ముందు అంగన్‌వాడీలకు తెలంగాణ కంటే అదనంగా వేతనాలు అందిస్తానని నమ్మించి గెలుపొంది నేడు సమస్య పరిష్కరించకుండా కేంద్రాలను తెరిపించేందుకు సచివాలయ సిబ్బందితో ప్రయత్నించటం దారుణమని టిడిపి అధ్యక్షులు గుద్దేటి ఎల్లారెడ్డి ఆరోపిం చారు. అంగన్‌వాడీలు వినూత్న రీతిలో కూరగాయలు అమ్మి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి ఉపాధ్యక్షులు తమ్మాశివారెడ్డి, మర్రి వెంకట్‌రెడ్డి, కొల్లి శ్రీనివాసరెడ్డి, విఎస్‌ఆర్ ప్రసాద్, దేవరపల్లి ఆంజనేయులు, జనసేన నాయకులు శ్రీరామ్ మూర్తి, బొడియ, సిఐటియు నాయకులు బొనిగల అగస్టీన్ పాల్గొన్నారు.

భట్టిప్రోలు : అంగన్‌వాడిల సమస్యల పరిష్కారానికి చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 8వ రోజుకు చేరింది. అంగన్‌వాడి కేంద్రాలను ఏదో విధంగా తెరిపించాలనే దృక్పథంతో ప్రభుత్వం కిందిస్థాయి అధికారులపై ఒత్తిడి చేయడంతో వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది కలసి పలుచోట్ల అంగన్‌వాడి కేంద్రాల తాళాలు పగలగొట్టి బలవంతంగా తెరిపించే ప్రయత్నం చేస్తున్నారు. దీనిలో భాగంగా పెద్దపులివరు అంగన్‌వాడి కేంద్రంలో అధికారులు తాళాలు పగల కొట్టేందుకు ప్రయత్నించగా కార్యకర్తలు, ఆయాలు అడ్డుకున్నారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగుతుందని, అధికారులు వచ్చి బలవంతంగా తాళాలు పగలకొట్టేందుకు ప్రయత్నిస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. దీంతో అధికారులు జరిగిన సంఘటనను ఫోటోలు తీసుకుని వెనుతిరిగి వెళ్లారు. తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్వాడీలు సమ్మె చేపట్టారు. సిఐటియు నాయకులు జి సుధాకర్, మురుగుడు సత్యనారాయణ, జి నాగరాజు, రైతు సంఘం కార్యదర్శి కె రామస్వామి పాల్గొన్నారు.

నిజాంపట్నం : అంగన్‌వాడిల సమ్మె 8వ రోజుకు చేరింది. సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మంగళవారం అంగన్‌వాడిలు భిక్షాటన చేశారు. సమ్మె శిబిరానికి యుటిఎఫ్ నాయకులు బాపయ్య, గణేష్‌రావు వచ్చి పూర్తి సంఘీభావం ప్రకటించారు. తర్వాత భిక్షాటనలో అంగన్వాడి వర్కర్స్ మట్లాడుతూ సంక్షేమ ప్రభుత్వమని చెప్పు మహిళలను రోడ్డున పడేసిందని దుర్మార్గపు ప్రభుత్వమని ఆరోపించారు. గతంలో ఏ ప్రభుత్వమూ తాళాలు పగులగొట్టలేదని గుర్తు చేశారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు రాజేశ్వరి, ధనలక్ష్మి, సిఐటియు నాయకులు శివశంకర్ పాల్గొన్నారు,

చెరుకుపల్లి : తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె 8వ రోజుకు చేరింది. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దీక్ష శిబిరంలో వంట వార్పు చేసి నిరసన తెలిపారు. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని అన్నారు. చైతన్య, సంతోష్ కుమారి, మంగ, వాణి పాల్గొన్నారు.

కారంచేడు : స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు వంటావార్పుతో నిరసన వ్యక్తం చేశారు. వంట చేసుకుని భోజనం చేశారు. స్వర్ణ, దగ్గుబాడు, కారంచేడు, కొంకలమర్రు గ్రామాల నుండి అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తక్షణమే డిమాండ్స్ పరిష్కారం చేయాలని కోరారు. ఈరోజు ధర్నాకు మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగుల నాయకులు బి శంకర్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి అనిత, శ్రీలక్ష్మి, రాధా, మేరీ, మరియమ్మ, సిఐటియు నాయకులు పి కొండయ్య పాల్గొన్నారు

చీరాల : అంగన్‌వాడీ యూనియన్ సమ్మె 8వ రోజు జరిగింది. ప్రభుత్వంతో మూడుసార్లు చర్చలు జరిగిన ఎలాంటి ప్రయోజనం లేదు. ఒకవైపు మంత్రి బొత్స సత్యనారాయణ తాళాలు పగలగొట్టమనలేదని స్టేట్మెంట్ ఇస్తూ ఇంకోవైపున తాళాలు పగలగొడుతున్నారని సిఐటియు నాయకులు అన్నారు. ప్రభుత్వం దొంద వైఖరి అవలంబిస్తుందని అన్నారు. సిఎం జగన్ ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని కోరారు. సమ్మెలో ఎపి వెలుగు విఒఏలు సమ్మెకు మద్దతు తెలిపారు. తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నాలో నినాదాలు చేశారు. అంగన్‌వాడీలు కోలాటం వేసి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం వసంతరావు, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి పి రేఖఎలిజిబిత్, పి ప్రమీల, జి సుజీవన, సులోచన, ఎ బ్యూల, అనిత, జ్యోతి పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : అంగన్‌వాడీల సమ్మె 8వ రోజు స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద సమ్మె సందర్భంగా చిత్రలేఖనం వేశారు. అంగన్‌వాడీలు అక్కడే వంట చేసుకుని భోజనం చేసి నిరసన వ్యక్తం చేశారు. సిపిఎం జిల్లా నాయకులు నలతోటి బాబురావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలను కట్టు బానిసల్లాగా చూస్తుందని అన్నారు. దొంగల్లాగా తాళాలు పగలగొట్టి సెంటర్స్ ను తెరవడం ప్రభుత్వానికి మంచిది కాదని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు, అంగనవాడి ప్రాజెక్టు లీడర్లు బి సరళ, లక్ష్మీ, కుమారి, అనురాధ, శ్రీలక్ష్మి, శ్రీదేవి, రాజ్యం, రమాదేవి, తులసి, జ్యోతి పాల్గొన్నారు.

నగరం : అంగన్‌వాడిల సమ్మె పరిష్కరించాలని కోరుతూ పొర్లుదండాలతో విన్నూతంగా నిరసన తెలిపారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అంగన్వాడీ వర్కర్స్,హెల్పర్స్ యూనియన్ నాయకులు డి జ్యోతి మాట్లాడుతూ తాము గ్రామస్థాయిలో పేదలకు చిన్న పిల్లలకు, అనేక సేవలు చేస్తున్న తమ పట్ల నిర్లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు నళిని, రజిని, భవాని, సుధా, అరుణ పాల్గొన్నారు

పంగులూరు : న్యాయమైన తమ డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 8రోజుకు చేరింది. అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అంగన్‌వాడీలను బెదిరించి, తాళాలు పగలగొట్టి, అంగన్‌వాడి కేంద్రాలను తెరిపిస్తున్నారని అన్నారు. తక్షణమే తమ డిమాండ్లను పరిశీలించి, పరిష్కారం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి గుడిపాటి మల్లారెడ్డి పాల్గొన్నారు.

అద్దంకి : స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు వంట, వార్పు చేవారు. డిమాండ్స్ పరిష్కారం చేయాలని కోరుతూ వారం రోజులుగా నిరవధిక సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు పోరాటం ఉధృతం చేస్తున్నట్లు సిఐటియు నాయకులు తిరుపతిరెడ్డి చెప్పారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, భీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రతిపక్ష నేతగా జగన్ ఇచ్చిన హామీ అమలు చేయాలని సిఐటియు నాయకురాలు జి శారద కోరారు.



చీరాలలో కోలాటంతో అంగన్‌వాడీల నిరసన



కారంచేడు తహశీల్దారు కార్యాలయంలో వంట వార్పు

వైసిపి ఇన్‌ఛార్జి హనిమిరెడ్డికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - పంగులూరు

వైసిపి నూతన ఇంచార్జ్ పానెం హనిమిరెడ్డికి బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద వైసీపీ కార్యకర్తలు మంగళవారం రాత్రి ఘన స్వాగతం పలికారు. తాడేపల్లి నుండి వస్తున్న హనిమిరెడ్డి సాయంత్రం ఆరున్నర ప్రాంతంలో టోల్ ప్లాజా వద్దకు చేరుకున్నారు. అంతకుముందే వందల సంఖ్యలో అక్కడ వేచి ఉన్న వైసిపి కార్యకర్తలు ఆయనకు జేజేలు కొడుతూ స్వాగతం పలికారు. ఆయనతోపాటు వైసిపి ముఖ్య నాయకులు, టిటిడి మాజీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, బాపట్ల ఎంపి నందిగం సురేష్ కూడా వచ్చారు. కార్యకర్తలు బొకేలు అందించి, పూలమాలతో ఘనంగా సత్కరించారు.



బొల్లాపల్లి టోల్‌గేట్ వద్ద కార్యకర్తలతో హనిమిరెడ్డి

అనంతరం హనిమిరెడ్డి కార్యకర్తలతో మాట్లాడారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని అన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు జంపాని రవిబాబు, వైసీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పులికం కోటిరెడ్డి, నాయకులు స్వయంపు హనుమంతరావు, బీసీ సెల్ కన్వీనర్ చక్రవరం భాస్కరరాజు, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పల్లపు రాము, రెడ్డి సంఘం రాష్ట్ర సమన్వయకర్త సిహెచ్ శంకరరెడ్డి, విక్టరీ ఫౌండేషన్ చైర్మన్ పసుమర్తి సుధాకర్, ముప్పవరం సర్పంచ్ రైతు సాంబశివరావు, డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లపూడి నాగేశ్వరరావు, కోటపాడు మాజీ సర్పంచ్ ఎర్రం గోపాలరెడ్డి, చిన్నమల్లవరం సర్పంచ్ వీరయ్య, ముప్పవరం ఎంపీటీసీ పూసల గంగాధర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి 5
బుధవారం 20 డిసెంబరు 2023

బతుకుపోరు బాటలో అంగన్‌వాడీలు

- ఎనిమిదో రోజు కొనసాగిన సమ్మె
- వంటావార్పుతో నిరసన




కనిగిరి, మద్దిపాడుల్లో వంటావార్పు నిర్వహిస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-కనిగిరి

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత ఎనిమిది రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా మంగళవారం కనిగిరి పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి మాట్లాడారు. అంగన్వాడీల పట్ల నిరంకుశంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఈ వైఖరిని విడనాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపకుండా అంగన్వాడీ కేంద్రాలను ఇతరులకు అప్పగించడం దుర్మార్గమన్నారు. హక్కులను కాల రాసేలా ప్రభుత్వ తీరు ఉందని ఇది సరికాదని తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు గ్రాట్యూటీ అమలు చేయాలని కోరారు. మినీ అంగన్వాడీ సెంటర్స్‌ను మెయిన్ సెంటర్స్‌గా అప్‌గ్రేడ్ చేయాలని, మినీ అంగన్వాడీ వర్కర్స్‌కు ప్రమోషన్స్ ఇవ్వాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిసి కేశవరావు మాట్లాడుతూ హెల్పర్స్ ప్రమోషన్లలో నిబంధనలు పాటించాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, ప్రభుత్వమే కేంద్రాలకు గ్యాస్ సిలిండర్లను సరఫరా చేయాలని, సూపర్వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎస్ సుజాత, మనోరంజిత, రజిని, సీత, రాజ్యలక్ష్మి నారాయణమ్మ అమల, అనిత, కవిత, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మద్దిపాడు: మద్దిపాడులో అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం ఎనిమిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వంట వార్పు కార్యక్రమం చేపట్టారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు. ఈ సమ్మెకు మద్దిపాడు అంగన్వాడీ ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి నాతాని ధనలక్ష్మి అధ్యక్షత వహించారు. సమ్మెలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, జిల్లా కార్యదర్శులు బంకా సుబ్బారావు, పల్లాపల్లి ఆంజనేయులు, మండల కార్యదర్శి ఉబ్బ ఆదిలక్ష్మి, ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎన్ జయప్రద, రజిని, రాధ, ప్రమీల, ఆదిలక్ష్మి, మేరీ, ప్రభావతి, శారద, కళ్యాణి, మద్దిపాడు ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: ఎన్నికల సమయంలో అంగన్‌వాడీల వేతనాలు పెంచుతామని వాగ్దానం చేసిన జగన్‌రెడ్డి నాలుగున్నరేళ్లు అయినా పట్టించుకోకపోవడం అన్యాయమని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె మంగళవారం ఎనిమిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో కంటే రూ.వెయ్యి వేతనం అధికంగా ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి మాట తప్పారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాళ్లు షేక్ ముంతాజ్, సుబ్బమ్మ, వెంకటలక్ష్మి, భారతి, ధనలక్ష్మి, మేరికుమారి, కాశీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం: సిఎం జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరినా పట్టించుకోనందున అంగన్‌వాడీలు సమ్మెలోకి దిగారని సిఐటియు జిల్లా నాయకులు డి సోమయ్య అన్నారు. సమ్మె చేయడాన్ని జీర్ణించుకోలేని జగన్ నిర్బంధాన్ని ప్రయోగించారని ఎద్దేవా చేశారు. మంగళవారం నాటికి అంగన్‌వాడీల సమ్మె 8వ రోజుకు చేరింది. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన వంటా వార్పులో సోమయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి తీరు మారకపోతే అంగన్‌వాడీల ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో అంగన్‌వాడీలతో పాటు సిఐటియు జిల్లా నాయకులు డికెఎం రఫీ తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా గిద్దలూరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు 8వ రోజు సమ్మె నిర్వహించారు. ఈ సమ్మెకు యుటిఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి మీగడ వెంకటేశ్వరరెడ్డి మద్దతు తెలిపారు. రాచర్ల గేటు వైఎస్సార్ సెంటర్‌లో అంగన్వాడీలు భిక్షాటన చేసి వారి ఆవేదనను వెలిబుచ్చారు.

బేస్తవారిపేట: ఎన్నికల ముందు పాదయాత్రలో అంగన్వాడీలకు వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను అమలుపరచాలని మాత్రమే అడుగుతున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ అన్నారు. స్థానిక పాత పంచాయతీ కార్యాలయ ఆవరణలో బేస్తవారిపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీలు చేపట్టిన ఆందోళన కార్యక్రమానికి రవీంద్రనాథ్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. సమ్మెను నిర్వీర్యం చేయడానికి అధికారులు ఇచ్చే మెమోలకు అంగన్వాడీలు భయపడకుండా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం అంగన్వాడీలు పట్టణంలో భిక్షాటన చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ కేఎండీ ఇబ్రహీం, గౌరవాధ్యక్షులు షేక్ అన్వర్ బాషా, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు కల్పన, కంభం కన్వీనర్ షేక్ అన్వర్, టీడీపీ ఒంగోలు పార్లమెంట్ కార్యదర్శి దోమల రమణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు రాజేశ్వరి, సరళ, శారద, ఆదిలక్ష్మి, శ్రీదేవి, అర్ధవీడు, కంభం, బేస్తవారిపేట మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: అంగన్‌వాడీల వేతనాన్ని రూ.26 వేలకు పెంచడంతో పాటు వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారానికి ఎనిమిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కనీస వేతన చట్టం అమలు చేయాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ముందుగా మండలంలోని కొలుకులలో అనారోగ్యంతో మృతి చెందిన మినీ కార్యకర్త వజ్రమ్మకు నివాళిగా కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ ఏరియా కో ఆర్డినేటర్ షేక్ అమీర్‌బాషా, అంగన్‌వాడీ నాయకురాళ్లు ఎ నాగమల్లేశ్వరి, అరుణ కుమారి, సుజాత, రోజా, సుబ్బులు, పి సుభాషిణి, సిహెచ్ సునీత, అరుణ, కే జయమ్మ, ఏ నాగరాజుకుమారి, సుబ్బులు తదితరులు పాల్గొన్నారు.

వెలిగండ్ల: అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ డిమాండ్స్ పరిష్కారం కోరుతూ వెలిగండ్ల ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం ఎనిమిదో రోజు వంట వార్పు చేపట్టారు. ఈ వంటా వార్పు కార్యక్రమంలో జిల్లా సిఐటియు ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి హాజరై మాట్లాడుతూ ఐసిడిఎస్ సేవలు గుర్తించి 8 సార్లు ప్రపంచ అవార్డు భారతదేశ ప్రభుత్వాలు తీసుకున్నాయని, కానీ వర్కర్స్ హెల్పర్స్ సేవలు మాత్రం చాలీచాలని వేతనాలతో మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర మానవ హక్కుల సంఘం చైర్మన్ ఎస్కే గౌస్ బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో చిన్నపాటి వేతనాలతో నడుస్తున్న అంగన్వాడీల పట్ల ప్రభుత్వాలు చిన్నచూపు చూడటం తగదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీఐటుయు నాయకులు రాయల మాలకొండయ్య, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సిహెచ్ రఫియా, సోము వెంకటశ్రీలక్ష్మి, గొర్రె ముచ్చు సలోమి, రెడ్డి తిరుపతమ్మ, అనురాధ, సుధారాణి, ఆదిలక్ష్మి, నాగేంద్రమ్మ, దమ్ము పద్మావతి, రాయల రమాదేవి, శారద, ఝాన్సీ రాణి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

దర్శి: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 8వ రోజు మంగళవారం వంటా వార్పు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయు దర్శి నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించే వరకు పోరాటాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి నాయకులు తిరుపతమ్మ, అజిత అధ్యక్షత వహించారు. సీఐటీయు నాయకులు సందు వెంకటేశ్వరరావుతో పాటు విశ్వవాణి, వెంకటరమణ, నాగమణి, బాలమ్మ, సుజాత, ప్రశాంతి, లక్ష్మీదేవి, నారాయణ, రంగనాయకులు, మోహన్‌రావు పాల్గొన్నారు.

కొండపి: అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌కు అంగన్‌వాడీ కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. మంగళవారం కొండపిలోని ఓ కార్యక్రమానికి కలెక్టర్ కొండపికి రాగా తహశీల్దారు కార్యాలయం ఆవరణలో గత 8 రోజులుగా సమ్మె దీక్ష అవలంబిస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్‌తో మాట్లాడుతూ తాము చేస్తున్న శాంతియుత సమ్మెను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి తమ సమస్యల పరిష్కారం కోసం సహకారం అందించాలని ఆయనను కోరారు. వ్యకాస నాయకులు కెజి మస్తాన్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొదిలి: అంగన్‌వాడీల సమ్మె ఎనిమిదో రోజు సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీలు వంటవార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, మాట తప్పకుండా మడమ తిప్పకుండా న్యాయమైన తమ డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని 20వ బూత్ కన్వీనర్ పమిడిమర్రి కిశోర్ ఆధ్వర్యంలో మంగళవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ భవిష్యత్తు గ్యారెంటీ బాండ్లను నమోదు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు తోటా మహేష్ నాయుడు మాట్లాడుతూ మహిళలకు టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోలోని అంశాలపై అవగాహన కల్పించారు. తల్లికి వందనం ద్వారా ఇంట్లో చదువుతున్న ప్రతి ఒక్కరికి ఏటా రూ.15 వేలు, ఆడబిడ్డ నిధి ద్వారా ప్రతి నెలా రూ.1500, అన్నదాతలకు ఏటా రూ.20 వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ యువతకు యువగళం ద్వారా ఉద్యోగాల కల్పన, దీపం పథకం ద్వారా ఏటా మూడు సిలిండర్లను ఉచితంగా అందజేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, చేదూరి కిశోర్, చలువాది శ్రీను, దేవకి బ్రహ్మానందరావు, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, పువ్వాడ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



వైపాలెంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి శ్రేణులు

శ్రీనివాసరెడ్డి మృతికి సంతాపం



ప్రజాశక్తి-దర్శి

దర్శి మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆళ్ళ శ్రీనివాసరెడ్డి (52) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన 25 సంవత్సరాలుగా అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఉంటూ అసోసియేషన్‌కు ఎంతో కృషి చేసినట్లు ఏపీ డ్రగ్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మునగా నరసింహారావు తెలిపారు. దర్శిలో అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఆయన చేసిన సేవలను కొనియాడారు. అసోసియేషన్ దర్శి కార్యదర్శి ఒగ్గు రాము, కోశాధికారి కే వెంకటేశ్వర్లు తదితరులు సంతాపం తెలిపారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

విద్యార్థికి అభినందనలు

సంతనూతలపాడు : స్థానిక ఎమ్మెస్సార్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థి గద్దమడుగు రాజేష్ అనే విద్యార్థి జాతీయ స్థాయి హాకీ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ విద్యార్థి మండలంలోని మైనంపాడు గ్రామానికి చెందినవాడు. ఇటీవల రాష్ట్రంలోని నక్కపల్లిలో జరిగిన హాకీ టోర్నమెంట్‌లో ఆడి జాతీయ స్థాయి జట్టుకు ఎంపిక కావడం గమనార్హం. రాజేష్ జనవరి 6న జలంధర్‌లో జరిగే టోర్నమెంటులో జాతీయ జట్టు తరపున ఆడనున్నారు. మంగళవారం కాలేజీలో ఆ విద్యార్థిని స్థానిక ఎమ్మెస్సార్ కళాశాల ప్రిన్సిపల్ డివి రమణారెడ్డి, కళాశాల డైరెక్టర్, చీమకుర్తి ఎమ్మెస్సార్ కళాశాల ప్రిన్సిపల్ వివి శివారెడ్డి, అధ్యాపకులు వెంకారెడ్డి అభినందించారు.

పులి శాంతి జన్మదిన వేడుకలు

సిఎస్ పురంరూరల్ : కనిగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి జన్మదిన వేడుకలను మంగళవారం సిఎస్ పురంలో ఘనంగా నిర్వహించారు. ముండ్లపాడు వైసిపి నాయకుడు పులి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా సంయుక్త కార్యదర్శి పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, నారాయణస్వామి ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, సచివాలయాల మండల అధ్యక్షుడు బైరెడ్డి తిరుపతిరెడ్డి, వైసిపి సేవాదళ్ మండల అధ్యక్షుడు పులి రామచంద్రారెడ్డి, అంబాల చంద్రశేఖర్‌రెడ్డి, నల్లమడుగుల, కోవిలంపాడు ఉపసర్పంచ్‌లు ముడుమాల నారాయణరెడ్డి, తీకేనం బాబురావు, మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు షేక్ గౌస్, ఆలా లక్ష్మయ్య, సంగిశెట్టి వాసు, మధు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

విత్తనశుద్ధితో తెగుళ్ల బారి నుంచి రక్షణ


కొత్తపట్నం: విత్తన శుద్ధి చేయడం ద్వారా పంటలను తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవచ్చునని ప్రకృతి వ్యవసాయం ఇన్‌ఛార్జి ఇందిర తెలిపారు. మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో ఎం రఘుపతి, సదావలి, సుబ్బారెడ్డి అనే రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో బీజామృతంతో విత్తనశుద్ధి చేసి శనగ, మినుము విత్తనాలు సోమవారం ఎదబెట్టారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ విత్తన శుద్ధి చేయడం వల్ల వేరు వ్యవస్థ బలపడుతుందని, తద్వారా కాండం కుళ్లు, ఇతర తెగుళ్ల పంటలకు సోకవని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంటిఎల్ వికాష్‌రెడ్డి, ఇందిర, ఐసిఆర్‌పి మాధురి, రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

కొండపి : కొండపిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ తనిఖీ చేశారు. ముందుగా సిడిపివో నుంచి అంగన్‌వాడీ కేంద్రాలలో ఎంతమంది చిన్నారులు వస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు రాని చిన్నారులకు కూడా పౌష్టికాహారాన్ని వారి ఇండ్ల వద్దకు చేర్చాలని సిడిపివోకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు పి సింగరావు, ఎంపిడివో రమణమూర్తి, ఎంఈవో సురేఖ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

సంతనూతలపాడు : స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 3,4,5,6 తరగతుల విద్యార్థులకు మంగళవారం ఫ్లోరోసిస్ వ్యాధి గురించి, ఆహారపు అలవాట్ల గురించి విద్యార్థులకు జిల్లా ఫ్లోరోసిస్ అధికారి డాక్టర్ అనిల్ కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ గాలి, నీరు, ఆహారం వలన వచ్చే వ్యాధుల గురించి, విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి డెంటల్ ఫ్లోరోసిస్ రాకుండా నివారణ గురించి వివరించారు. అనంతరం స్థానిక హైస్కూల్‌లో ఉన్న ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించి నీటి శాంపిళ్లను సేకరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓఆర్ ప్రసాద్, హెచ్‌వి సలోమి, ఎమ్మెల్‌హెచ్‌పి శ్రీకాంత్, ఏఎన్‌ఎం కృష్ణవేణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన కర్లపాలెం ఉపసర్పంచి పఠాన్

టిడిపిలో చేరిన ఉపసర్పంచి పఠాన్

ప్రజాశక్తి - బాపట్ల

కర్రపాలెం ఉపసర్పంచి పఠాన్ అహ్మద్ భాషా టిడిపిలో చేరారు. టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో ఆయన టీడీపీ కండువా కప్పుకున్నారు. పంచాయతీ ఉప సర్పంచిగా, వైసీపీ సీనియర్ నాయకులుగా ముస్లిం సామాజిక వర్గంలో క్రియాశీలకంగా వ్యవహరించిన అహ్మద్‌బాషా టిడిపిలో చేరడంతో వైసీపీ నాయకులు అంతర్మ దనంలో పడ్డారు. పఠాన్ మాట్లాడు తూ ఎమ్మెల్యే పక్షపాత ధోరణితో విసిగి పోయామని అన్నారు. వైసిపిలో కష్టపడి పనిచేసే కార్యకర్తకి విలువలేదనే టిడిపిలో చేరినట్లు తెలిపారు. రానున్న కొద్ది రోజుల్లోనే భారీ సంఖ్యలో తనతో పాటు వంద మందికిపైగా మైనారిటీ నాయకులు టీడీపీ కండువ కప్పుకోనున్నారని తెలిపారు.



కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో వెంకటేశ్వరరావు

కాంగ్రెస్ బలోపేతానికి సమీక్షలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వేమూరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పునర్నిర్మించేందుకు సమీక్షలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ ఇన్చార్జి తాడికొండ వెంకటేశ్వరరావు తెలిపారు. కాంగ్రెస్ ముఖ్య నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 28నుండి మండలాల వారీగా అందరిని సమీక్షించి నియోజకవర్గ స్థాయిలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనివార్య కారణాలతో రాష్ట్ర విభజన జరగటం ద్వారా ప్రజల్లో కాంగ్రెస్ దూరమైందని అన్నారు. విభజన సమయంలో చేసిన చట్టాలను నేటి పాలకులు అమలుపరచటంలో విఫలం చెందారని అన్నారు. దీని కారణంగా రాష్ట్రం అభివృద్ధికి దూరమైందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌కే సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు నిజాంపట్నం ఏడుకొండలు, గౌస్ బేగ్, అమృతలూరు మండల అధ్యక్షులు దేవరపల్లి అంబేద్కర్, యార్లగడ్డ గోపి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

ప్రజాశక్తి - రేపల్లె



ప్రచార రథం ప్రారంభిస్తున్న ఆర్‌డిఒ

కలెక్టర్ ఆదేశాల మేరకు ఈవీఎంల పై అవగాహన సదస్సు ఆర్డీఒ హేలా షారోన్ మంగళవారం నిర్వహించారు. ఈ సంధ్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ శిక్షణ పొందిన పిఓ, ఏపిఓలు పోలింగ్ బూతుల్లో సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ చేపట్టాలని సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా, శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లచే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను, నిబంధనలను సంపూర్ణంగా అర్థం చేసుకోవాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈవీఎంలు వాడే విధానంపై పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పోలింగ్ రోజు మాక్ పోల్ నిర్వహించి క్లోజ్ రిజల్ట్ క్లియర్ బటన్ (సిఆర్సి) అయ్యేదాకా పరిశీలించిన తర్వాత పోలింగ్ మొదలు పెట్టాలన్నారు. ప్రతి ఒక్కరు ఫారం12 ఫిలప్ చేసి ఇవ్వాలని అన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రముల అవగాహన ప్రచార రథం ప్రారంభించారు. కార్యక్రమంలో తహశీల్దారు మల్లికార్జునరావు, మున్సిపల్ కమిషనర్ బి విజయ సారధి పాల్గొన్నారు.

ఒళ్లు దగ్గర పెట్టుకొని పని చేయండి

బిఎల్‌ఒలపై కలెక్టర్ రంజిత్ బాషా ఆగ్రహం

ప్రజాశక్తి - వేటపాలెం

బిఎల్‌ఒలు ఒళ్ళు దగ్గర పెట్టుకుని పని చేయాలని, లేదంటే ఇంటికి పోతారని కలెక్టర్ పి రంజిత్ భాష ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నగంజాం, వేటపాలెం మండలాల్లో ఆయన మంగళవారం ఆకస్మికంగా పర్యటిం చారు. వేటపాలెం మండల పరిషత్ సమావేశహాలులో బిఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఒక్కొక్కరిని పిలిచి రికార్డులను పరిశీలించారు. బిఎల్‌ఓ అంటే ఏంటి? మీరు ఏ శాఖ ఉద్యోగులు? బిఎల్‌ఓకి అర్థం తెలియదా అంటూ ఒక్కసారిగా కలెక్టర్ స్వరం పెంచడంతో ఆ ప్రాంగణమంతా నిశ్శబ్దం ఆవరించింది. విలేకర్లు ఫోటోలు తీసుకొని బయటికి వెళ్లాలని ఆదేశించారు. సమావేశం అనంతరం కలెక్టర్ విలేకర్లతో మాట్లాడారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ, ఓటర్ల జాబితాలో అభ్యంతరాలపై పకడ్బందీగా విచారించి అధికారులు



ఓటర్ల జాబితాలు పరిశీలిస్తున్న కలెక్టర్ పి రంజిత్‌బాషా

చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఓటర్ల జాబితా రూపొందించే ప్రక్రియపై విచారణ నిర్వహిం చారు. అందుకు సంబంధించిన దస్త్రాలను పరిశీలించారు. అనంతరం బిఎల్‌ఓలతో ఆయన అత్యవసరంగా సమావేశమై సూచనలు చేశారు. పౌరుల నుంచి వచ్చిన దరఖాస్తులను అధికారులు నిశితంగా పరిశీలించాలని తెలిపారు. 2024 జనవరి 5న ఓటర్ల తుది జాబితా విడుదల చేయనున్న నేపథ్యంలో విచారణ ప్రక్రియ గడువులోగా పూర్తి చేయాలన్నారు. రెండు మండలాల్లో ఈనెల9 వరకు వచ్చిన దరఖాస్తుల విచారణ ప్రక్రియ 95శాతం పూర్తయిందన్నారు. పౌరుల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో ధ్రువీకరణ పత్రాలు నిబంధన మేరకు ఉన్నాయో లేదా అంటూ ఆరా తీశారు. ఓట్ల చేర్పులు, మార్పులకు సంబంధించిన దస్త్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఓట్ల తొలగింపు ప్రక్రియకు చెందిన నోటీసులు సంబంధిత పౌరులకు ఇవ్వాలని, లేదా ఇంటి తలుపులకు అంటించడం, లేదా సచివాలయాల నోటీస్ బోర్డులో ప్రదర్శనకు ఉంచాలన్నారు. చినగంజాం మండలంలో నేటికి 400దరఖాస్తులు పెండింగులో ఉండగా 25లోగా విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో చీరాల ఆర్డీఒ సరోజిని, చిన్నగంజాం, వేటపాలెం తహసిల్దార్లు పార్వతి, అశోక వర్ధన్ పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌తో శాస్త్రీయ అవగాహన

ప్రజాశక్తి - పంగులూరు

శాస్త్రీయ విజ్ఞానం ద్వారా ప్రజల దైనిందిన జీవితంలో అనేక అవసరాలను తీర్చే సైన్స్ పరికరాలను తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చని పలువురు విద్యార్థులు తయారు చేసిన పరికరాలు సైన్స్ ఎగ్జిబిషన్‌లో పలువురుని ఆకర్షించాయి. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయిలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు సైన్స్ పరికరాలను తయారు చేసి ప్రదర్శించారు. మొత్తం 14ప్రయోగాలు ఇందులో ఆవిష్కరించగా అందులో మొదటి బహుమతిగా వ్యక్తిగత విభాగంలో బూదవాడ విద్యార్థిని వలేరు రమ్య తయారు చేసిన అండర్ పార్ట్ టెన్నల్ ప్రాబ్లమ్స్ అండ్ సొల్యూషన్స్ కు లభించింది. రెండవ బహుమతి గ్రూప్ క్యాటగిరిలో చంద్రయాన్2 తయారు చేసిన బూదవాడ జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు జీవి పావని, సాయి ప్రజ్ఞ, ఉల్లగంటి రహిల సాధించారు. మూడో బహుమతిని టీచర్స్ కేటగిరీలో ఆండ్రాయిడ్ బ్రూ సెల్ హెూమ్ అండ్ ఏ ట్రైన్ సిస్టం లభించింది. ఈ సందర్భంగా జరిగిన సభలో పాఠశాల హెచ్‌ఎం కొపోల్లు రమాదేవి మాట్లాడుతూ సైన్స్ ఎగ్జిబిషన్‌కు సహకరించిన ఉపాధ్యాయులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మండల సైన్స్ ఆఫీసర్ రావి



విద్యార్థుల ప్రయోగాలను పరిశీలిస్తున్న పర్చూరు ఎంఇఒ

శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెంచి సైన్స్ పట్ల ఆకర్షితుల అవటానికి ఈ సైన్స్ ఎగ్జిబిషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. న్యాయ నిర్ణీతలుగా బండారుపల్లి రమేష్ బాబు, కె స్వర్ణలత వ్యవహరించారు. అనంతరం బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి రాయిని ప్రమీల, ఎంఇఒ జి వీరాంజనేయులు, విద్యాదాత వడ్డవల్లి వీరనారాయణ, పాఠశాల సైన్స్ కన్వీనర్ శ్రీగిరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పర్చూరు : స్థానిక వైఆర్ హైస్కూలులో మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఎంఇఒ పి వెంకట రామయ్య మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ ప్రదర్శనలు ఎంతో దోహద పడుతుందని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు వివిధ అంశాలపై 28 ప్రయోగాలను ప్రదర్శించారు. వీటిలో 3ప్రదర్శనలు జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఈదర రాజశేఖర్, నోడల్ అధికారి జి శ్రీహరినాథ్, కాంప్లెక్స్ సెక్రటరి శివయ్య పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : స్థానిక బాలికోన్నత పాఠశాలలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన మంగళవారం నిర్వహించారు. ఎంఇఒ పి రాఘవరావు ప్రదర్శనను ప్రారంభించారు. వివిధ పాఠశాలల నుండి 24 ప్రదర్శనలను ప్రదర్శించారు. న్యాయ నిర్ణేతలుగా వై వాయునందనరావు, మేడూరి సత్యనారాయణలు వ్యవహరించారు. కార్యక్రమంలో సైన్స్ కో ఆర్డినేటర్ కె రమేష్‌బాబు, పేరంట్స్ కమిటి చైర్మన్ కె మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

కారంచేడు : మండలంలోని స్వర్ణ జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో సైన్స్ ఫెర్ మంగళవారం నిర్వహించారు. ఎంఇఒ సత్యనారాయణ మాట్లాడుతూ సైన్స్ ఆవశ్యకత ఎంతో ఉన్నదని అన్నారు. విద్యార్థులు సైన్స్ గురించి తెలుసుకోవాలని అన్నారు. సభకు హెచ్‌ఎం శ్రీరామ్ సుబ్బారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు క్రిస్టఫర్, సుబ్బారావు, నరసింగరావు, మస్తాన్, మురళి, నీరజ, శివ, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

రాంప్రసాద్ బిస్మల్, అష్ఫాఖుల్లా ఖాన్‌కు నివాళి



బాపట్లలో రాంప్రసాద్, అష్ఫాఖుల్లాఖాన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

భారతదేశ స్వాతంత్ర్యం కోసం నవ్వుతూ ఉరికంభాన్ని అధిరోహించిన రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్ ధన్యులని సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ కొనియాడారు. సాహితీ భారతి ఆధ్వర్యంలో రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్ 96వ వర్ధంతి సభ మంగళవారం నిర్వహించారు. రాంప్రసాద్ బిస్మిల్ స్వాతంత్ర్యం కోసం హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్ అనే విప్లవ సమస్థను స్థాపించారని అన్నారు. ఆయుధ సంపత్తి కోసం బ్రిటిష్ ప్రభుత్వం తమ ఖజానాలో దాచటానికి తీసుకు వెళుతున్న ధనాన్ని ఉత్తరప్రదేశ్‌లోని కాకోరి స్టేషన్ దగ్గర రైలు దోపిడీ చేసి హస్త గతం చేసుకున్నారని అన్నారు. ఈ కారణంగా రాంప్రసాద్ బిస్మిల్‌ను గోరఖ్ పూర్ జైల్లో, అష్ఫాఖుల్లాఖాన్‌ను ఫైజాబాద్ జైలులో 1927 డిసెంబర్ 19న ఉరితీసారని గుర్తు చేశారు. ప్రజాకవి వైద్య విద్వాన్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ అష్ఫాఖుల్లా ఖాన్ దేశ స్వాతంత్రాన్ని ప్రాణాల కన్నా మిన్నగా భావించిన త్యాగమూర్తి అన్నారు. సర్వమత సామరస్యాన్ని కాంక్షించిన మానవతా మూర్తి అని ప్రశంసించారు. మర్రి మాల్యాద్రిరావు మాట్లాడుతూ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఇరువురు హిందీ, ఉర్దూ భాషల్లో గొప్ప కవులని అన్నారు. ఎన్నో దేశభక్తి గీతాలు రచించి యువతలో స్ఫూర్తి నింపారని తెలిపారు. సభలో ఆదం షఫీ, ఎన్ కృష్ణ, ఎం జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీనివాసమూర్తి, పువ్వాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : దేశస్వాతంత్రం కోసం బ్రిటిష్ వారి చేతిలో వీరమరణం పొందిన అష్ఫాఖుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్ నేటి యువతకు ఆదర్శమని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి షేక్ మహ్మద్ బాషా అన్నారు. అష్ఫాఖుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్ 96వ వర్ధంతి సభ మేకా ఇర్మియా అధ్యక్షతన నిర్వహించారు. నరేంద్రమోడీ 2వసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి స్వాతంత్ర్య పోరాటంలో అశేష త్యాగాలు చేసిన భారతీయ ముస్లింలను దేశద్రోహులుగా చిత్రీకరించడానికి అబద్ధాలతో నిండిన విషప్రచారం సాగించడం దారుణమని అన్నారు. విదేశీ పెట్టుబడులను ఆమోదించి, అమెరికా సామ్రాజ్యవాదానికి ఫిడేలు వాయించేదిగా మోడీ ప్రభుత్వం తయారైందని అన్నారు. కార్యక్రమంలో ఏఐఆర్‌డబ్ల్యూఒ రాష్ట్ర కార్యదర్శి సుజాత, బొల్లాపల్లి బెంజిమెన్, కుల నిర్మూలన ఉద్యమం నాయకులు జాన్ వెస్లీ, జె అంజయ్య పాల్గొన్నారు.



మార్టూరులో రాంప్రసాద్, అష్ఫాఖుల్లాఖాన్‌కు ఘన నివాళి



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న సిహెచ్‌సి డాక్టర్ శివచెన్నయ్య

సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - పంగులూరు

ప్రజల్లో శాంతి, సమాధానం కలుగజేసి, సమ సమాజ స్థాపనకై ప్రభువైన యేసుక్రీస్తు జన్మించాడని పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ శివ చెన్నయ్య అన్నారు. స్థానిక పిహెచ్‌సి ఆవరణలో మంగళవారం సెమీ క్రిస్టమస్ వేడుకలు నిర్వహించారు. ప్రపంచ శాంతి కోసం జరిగిన పోరాటంలో శాంతిని పెంపొందించి, మనుషుల్లో సామాజిక మార్పును తీసుకొచ్చేందుకు ఏసుప్రభు కృషి చేశాడని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా క్రీస్తు జన్మదినంను క్రిస్టమస్ పండుగ జరుపుకుంటారని అన్నారు. కుల, మత, ప్రాంతీయ బేధాలు లేకుండా అందరూ జరుపుకుంటారని అన్నారు. ప్రభుత్వ హాస్పిటల్లో ఇలాంటి కార్యక్రమాలు జరపటం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కృష్ణ కుమార్ మాట్లాడుతూ ప్రజల్లో శాంతిని నెలకొల్పేందుకు అనేకమంది గొప్ప వ్యక్తులు పుట్టారని అన్నారు. అలాంటి వారిలో ఏసుక్రీస్తు అగ్రగన్యుడని అన్నారు. ఆయన విశ్వ మానవాళి కోసం మరణించాడని అన్నారు. అంతకుముందు డాక్టర్ శివ చెన్నయ్య, డాక్టర్ కృష్ణకుమార్, డాక్టర్ బాల రాజేశ్వరి క్మిస్మస్ కేక్ కట్ చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ అనురాధ అధ్యక్షత వహించారు. ఏఎన్‌ఎం ఎస్తేరు రాణి, సిహెచ్‌ఓ భారతి పాటలు పాడారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం జానకి, సతీష్ కుమార్, ఏసోబు మాట్లాడారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - పర్చూరు

ప్రకృతి వ్యవసాయంపై పండించే ఏటిఎం మోడల్స్, ఏ గ్రేడ్ మోడల్స్ ప్రకృతి వ్యవసాయ కేంద్రం వాటిపై మండలంలోని మహిళా సభ్యులకు డివిజన్ శిక్షకుడు సిహెచ్ అప్పారావు మంగళవారం అవగాహన కల్పించారు. మండలంలోని కొల్లావారిపాలెంలో సాగు చేసిన ఎటిఎం మోడల్‌ను, 30రకాల కూరగాయలు, ఆకు కూరలు, దుంపజాతి, పండ్ల జాతి, ధాన్యపు పంటలను చూపించి అవగాహన కల్పించారు. వీటిని సాగు చేయటం వలన భూమి సారవంతంగా మారి పోషక విలువలు కలిగి ఉంటాయని అన్నారు. తద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగవుతుందని సూచించారు. నూతలపాడులో నరేష్ సాగు చేసిన మిర్చి పొలాన్ని, ప్రకృతి వ్యవసాయ కేంద్రంలో తయారు చేసే కషాయాన్ని, వాటి వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నాగమ్మ, అంజలి, హెబ్సిబా, సిసి విజయలక్ష్మి పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేసిన పంటల పరిశీలన

వేటపాలెం : మండలంలోని పందిళ్ళపల్లిలో మండల సమాఖ్య ఎక్స్‌పోజర్ విజిట్ మంగళవారం చేశారు. మండల సమాఖ్య ఆఫీస్ బేరర్స్ అయిన ఐదుగురు సభ్యుల్లోని ఆదిమ్మ, మహాలక్ష్మి, సౌజన్య ప్రకృతి వ్యవసాయం చేస్తున్న గోవన ఆదయ్య వరి పొలం, మామిడి తోటను, ఏటీఎం మోడల్‌లో వేసిన కూరగాయల ఫీల్డును పరిశీలించారు. ఏఒ కాశీ విశ్వనాథ్, ఎన్ఎఫ్ఎ నాచురల్ ఫార్మింగ్ అసిస్టెంట్ వరదానం, మాస్టర్ ట్రైనర్ భారతి, వేటపాలెం, అక్కయ్యపాలెం యూనిట్ల ఇన్చార్జులు పాల్గొన్నారు.

సంతమాగులూరు : ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా పంటలు పండించుటవలన పురుగు మందు అవశేషాలు లేని పోషక విలువలతో కూడిన ఆహారాన్ని పొందవచ్చని మండల సమైక్య అధ్యక్షురాలు ఇల్లూరి లక్ష్మీశేషు తెలిపారు. మండలంలోని ఏల్చూరులో ప్రకృతి వ్యవసాయంపై మండల సమైక్య ఆధ్వర్యంలో మంగంళవారం విజ్ఞాన యాత్ర చేశారు. ప్రకృతి వ్యవసాయం వారిచే సమైక్య సభ్యులకు ప్రకృతి వ్యవసాయ విధానాలపై విజ్ఞాన యాత్ర నిర్వహించారు. డి మహాలక్ష్మి చెందిన 20సెంట్లు విస్తీర్ణంలో 20రకాల పంటలతో సాగుచేసిన ఎటీఎం మోడల్‌ను సందర్శించారు. ఈ మోడల్ విధానం ద్వారా 20సెంట్లు విస్తీర్ణంలో సంవత్సరానికి రూ.1.50లక్షల ఆదాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్డిఏ వైఎస్ఆర్ క్రాంతి పథకం ఎపిఎం డి మస్తానరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల పేదవారు తక్కువ విస్తీర్ణంలో ఎటీఎం మోడల్ వేసి మంచి ఆదాయం పొందవచ్చన్నారు. డిఎల్ఎంపీ జై మోహన్, సీసీ వెంకయ్య పాల్గొన్నారు.



మలేరియా విభాగం సహాయ డైరెక్టర్ వీరరాజు పరిశీలన

మలేరియా జోనల్ ఆఫీసర్ పర్యటన

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

ఈస్ట్ బాపట్ల పంచాయతీలోని నందిరాజుతోటలో మలేరియా డిపార్ట్మెంట్ జోనల్ అసిస్టెంట్ డైరెక్టర్ వీర్రాజు మంగళవారం పర్యటించారు. గతంలో డెంగ్యూ జ్వరం బారిన పడిన గృహాన్ని సందర్శించారు. పరిసర ప్రాంతాల్లో దోమల స్థావరాలను నిశితంగా పరిశీలించారు. నివారణ కోసం సూచనలు చేశారు. వర్షపు నీరు, కాలువల్లో మురికి నీరు నిల్వ లేకుండా చూడాలని చెప్పారు. టైర్లు, కొబ్బరి చిప్పలు, తొట్లు, డబ్బాల్లో వర్షం నీరు చేరి దోమల ఉత్పత్తి జరుగుతోందని అన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్యం నిరంతరం చేయాలని చెప్పారు. పంచాయతీ, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ఆయన వెంట జిల్లా మలేరియా అధికారి రాజకుమార్, పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు పాల్గొన్నారు.



బట్టలు పంపిణీ చేస్తున్న దళిత నేత దేవరపల్లి బాబురావు

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - చీరాల

క్రిస్టమస్ పండగ సందర్భంగా మాజీమంత్రి డాక్టర్ పాలేటి రామారావు హయ్యర్ పేటలో దేవరపల్లి బాబురావు ఆధ్వర్యంలో పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. 2024 క్యాలెండర్ ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. క్రీస్తు శాంతి సందేశం మానవ మనుగడకు ఆదర్శ సూత్రమని అన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఎంతో గొప్పగా జరుపుకునే పండుగల్లో క్రిస్మస్ ప్రథమ పండుగని అన్నారు. కార్యక్రమంలో పాస్టర్ ముత్యాలబాబు, దేవరపల్లి హేమలత, దేవరపల్లి దావీదు, తలగల సుగుణమ్మ పాల్గొన్నారు

పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి- సంతమాగులూరు

సమాజంలో విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలని ఎంఈఓ వి కోటేశ్వరరావు కోరారు. స్థానిక ఎంపీపీ ఎస్ పాఠశాల్లోని భవిత సెంటర్లో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ట్యాబులు, పుస్తకాలు, పెన్నులను అందజేశారు. ఎంఈఓ కోటేశ్వరరావు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకొని అభివృద్ధి చెందాలని సూచించారు. ఎంఈఓ దినేష్ కుమార్ మాట్లాడుతూ వైకల్యం ఉన్న పిల్లలు ప్రతిభావంతులుగా ఉంటారని అన్నారు. దేనిలో వెనుకబడి ఉండరని అన్నారు. కార్యక్రమంలో దివ్యాంగ విద్యార్థులు చెన్నుపల్లి అనూష, వీర వసంత రాయుడు, అమూల్యకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లు, పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అనురాధ, ఫిజియోతెరపిస్టు ఇందిరా ప్రియదర్శిని, ఐఇఆర్టిలు పిలిప్‌రెడ్డి పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

ప్రజాశక్తి- రేపల్లె

ఏపీపీఎస్సీ -గ్రూప్2 ఉద్యోగాలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థుల కొరకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంవిబి సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం సాయంత్రం తెనాలి ఎన్జీఒ కళ్యాణ మండపంలో సదస్సు జరుగుతుందని తెలిపారు. విద్యావేత్త, ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు పరీక్ష విధానం తదితర విషయాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. 120పేజీలు మెటీరియల్ ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. యుటిఎఫ్, జెవివి, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రూప్-2కు సన్నద్ధమయ్యే అభ్యర్థులందరూ హాజరై అవగాహన పెంచుకోవాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ నాయకులు సిహెచ్ రాజభూషణం, వివి సుబ్బారావు, ఎం వెంకయ్య, జి రవీంద్ర, జి శ్రీనివాసరావు, ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

ప్రజాశక్తి - చీరాల



చీరాలలో నకార చిత్రపటానికి ఘన నివాళులు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర విశ్రాంతి ఉద్యోగుల సంఘం అహర్నిశలు శ్రమిస్తుందని రాష్ట్ర అధ్యక్షులు శాస్త్రి, పూర్వ అధ్యక్షులు ఆల్రాయిడ్ అన్నారు. స్థానిక ఎస్ఐ రంగనాయకులు, బాపనమ్మ కళ్యాణ మండపంలో పెన్షనర్స్ డే వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అవసరమైతే ఉద్యమించాలని సూచించారు. సమస్యలు గురించి చర్చించి పలు తీర్మానాలు చేసుకున్నారు. అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఏకాంబరేశ్వర బాబు, నాగరాజు, నారాయణరావు, నరసింహారావు, దామర్ల బాపయ్య, శివప్రసాద్, రామారావు, సిద్దయ్య, వీరబ్రహ్మం, మస్తాన్ పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : పెన్షనర్ల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. సంఘ ఉపాధ్య క్షులు రావుల బాపయ్య చౌదరి, హైదరాబాద్ ఆకాశవాణి విశ్రాంత ఉద్యోగి వలేటి గోపీచంద్, తిమ్మసముద్రం, ఇంకొల్లు, ఇడుపులపాడు బ్యాంకు మేనేజర్లు హాజరయ్యారు. పెన్షనర్ల ఆరాధ్యుడు డిఎస్ నకారా చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించా రు. బ్యాంకు మేనేజర్లు పెన్షనర్లకు తమ బ్యాంకుల్లో వున్న సేవలను గురించి వివరించారు. 75ఏళ్ల నిండిన పెన్ష నర్లను, వలేటి గోపీచంద్, రావుల బాపయ్యను సత్కరిం చారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు వై కృష్ణమూర్తి, కార్యదర్శి కరి కమలేశ్వరరావు, తూమాటి ఆంజనేయులు, డాక్టర్ ఆలా శ్రీకృష్ణమూర్తి, వీరాంజనే యులు, గోరంట్ల హరిబాబు, నార్నె తాతయ్య, పివి సుబ్బారావు, ఆవుల హనుమంతరావు, రంగారావు, యువి గోపాలరావు, జివి రమణమూర్తి, కందిమళ్ల మధన మోహనరావు పాల్గొన్నారు.

డ్రోన్ పైలట్ శిక్షణకు వ్యవసాయ విద్యార్థులు

ప్రజాశక్తి - బాపట్ల



విద్యార్థులను అభినందిస్తున్న డీన్ కోటేశ్వరరావు

వ్యవసాయ విద్యలో భాగంగా రైతుల సంక్షేమ కోసం వ్యవసాయ విద్యార్థులకు డ్రోన్ పైలట్ శిక్షణ ఇచ్చేందుకు ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అత్యంత ప్రాధాన్యత నిస్తుందని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ఇన్చార్జి ఎస్ఆర్ కోటేశ్వరరావు తెలిపారు. డ్రోన్ పైలెట్ శిక్షణకు ఎంపికైన విద్యార్థులతో కలిసి విలేకరులతో మంగళవారం మాట్లాడారు. కళాశాలకు చెందిన 5మంది బిఎస్సీ మూడో యేడాది విద్యార్థినీ, విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. గుంటూరులాంలో శిక్షణ ఇస్తారని తెలిపారు. డిజిసిఎ ఆథరైజ్డ్ రిమోట్ పైలట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ద్వారా ఈ నెల 20నుండి 31వరకు 12రోజుల పాటు శిక్షణ ఇస్తారన్నారు. డ్రోన్ పరికరం ద్వారా పంట చేలలో విత్తనాలు విత్తటం, ఎరువులు క్రిమిసంహారక మందులు చల్లడంలో శిక్షణ ఇస్తారని తెలిపారు. వ్యవసాయంలో రైతులకు కూలీ ఖర్చులను తగ్గించడమే గాక తక్కువ సమయంలో అధిక విస్తీర్ణంలో వ్యవసాయ సంబంధిత పనులను సులభంగా చేయడానికి సాంకేతికంగా వ్యవసాయ పురోగతిని సాధించడానికి దోహద పడుతుందని తెలిపారు. విద్యార్థుల పూర్తి స్థాయి మెరిట్ ఆధారంగా శిక్షణకు ఎంపిక చేసినట్లు తెలిపారు. సంస్థాగత అభివృద్ధి ప్రణాళిక (ఐడిపి)లో భాగంగా సెన్సార్స్ అండ్ స్మార్ట్ అప్లికేషన్స్ రీసెర్చ్ ఇన్ అగ్రికల్చర్ (అప్సర) కేంద్రం ద్వారా శిక్షణ ఇస్తారని వివరించారు. కార్యక్రమంలో ఐడిపి, ఎన్ఏహెచ్ఎపి కో ఆర్డినేటర్లు కె చంద్రశేఖర్, వి సీతారాంబాబు పాల్గొన్నారు.

ఉచిత వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చీరాల



పట్టణంలో ర్యాలి నిర్వహిస్తున్న విద్యార్థులు

సూట్స్ కేర్ నెట్వర్క్ అనే ఆరోగ్య సంస్థ మహిళ ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఉచిత వైద్యం అందిస్తుందని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఒకటో పట్టణ ఎస్ఐ అరుణ జ్యోతి ర్యాలీ ప్రారంభించి మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకునేందుకు గొప్ప అవకాశమని అన్నారు. 100 రోజులపాటు సూట్స్ ఉమెన్ ఉచిత హెల్త్ క్యాంపెయిన్ జరుగుతుందని తెలిపారు. ఉచిత ఓపితోపాటు ల్యాబ్ టెస్టులు, మందులపై రాయితీ ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో మహిళా కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ జయశ్రీ, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ నాగూర్ బాబు, డాక్టర్ చంద్రశేఖర్, సూట్స్ కేర్ సిబ్బంది, అమెరికన్ డెలిగేట్స్, విద్యా భారతి స్మార్ట్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో కరణం బలరామకృష్ణమూర్తి

సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - చీరాల

మరియమ్మపేటలోని హొసన్నా మందిరంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి కేక్ కటింగ్ చేసి ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అయన వెంట చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండ్రు బాబ్జి, కౌన్సిలర్లు ఎబినేజర్ పాల్గొన్నారు. విద్యుత్ డివిజన్ కార్యాలయంలో జరిగిన సెమీ క్రిస్టమస్ వేడుకల్లో డిఇ కె జాన్ థామస్, ఏపీ సిపిడిసిఎల్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఎల్ రఘుబాబు, జిల్లా రీజినల్ సెక్రెటరీ కె ఆనందరావు, జె కళ్యాణ్ రామ్, వి విజయ్ కుమార్ పాల్గొన్నారు

పంగులూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పంగులూరు

కోరిసపాడు మండలం రావినూతలలో కీర్తిశేషులు ఎలగాల సుబ్బారావు మెమోరియల్ ప్రతిభ ప్రోత్సాహక బహుమతుల ప్రతిభా పరీక్షలో పంగులూరు మండల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనపరిచారు. ఈనెల 16న జరిగిన ప్రతిభా పరీక్షలో ఓసి విభాగంలో బూదవాడ జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థి బి శివాని మొదటి, పంగులూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థి ఆర్ సాంబశివ మహేష్ ద్వితీయ బహుమతి సాధించారు. కన్సోలేషన్ బహుమతిని చందలూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని రూప శ్రీ అందుకున్నారు. బీసీలు భాగంలో చందలూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థి హరి ప్రకాష్ మొదటి, సిహెచ్ హారిక ద్వితీయ, బూదవాడ జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్‌కె గౌస్ బాషా ద్వితీయ బహుమతి సాధించారు. కొండ మంజులూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థి పి యశ్వంత్ కన్సోలేషన్ బహుమతి గెలుచుకున్నారు. ఎస్సీ, ఎస్టీ విభాగంలో బూదవాడ జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థి వై సౌమ్య ద్వితీయం సాధించగా, కచందలూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థి ఎన్ రాహుల్ కన్సోలేషన్ బహుమతి సాధించారు. రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, కన్సోలేషన్ బహుమతి రూ.3వేలు ప్రకటించారు. కొరిసపాడు, అద్దంకి, పంగులూరు, ఇంకొల్లు మండలాల స్థాయిలో జరిగిన ఈ పోటీలకు 215మంది విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు సంక్రాంతి పండుగ రోజు బహుమతులు ప్రధానం చేస్తారు.



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి రోటరీక్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ స్టడీ మెటీరియల్ మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు వెంకటేశ్వర్లు, శివాజీ, రోటరీక్లబ్ నాయకులు ఏవీరారెడ్డి,జి వెంకటరావు, మన్నం నాగరాజు, ఆదిరెడ్డి,టి. శ్రీను, ఉపాధ్యాయుడు సుబ్బారావు,,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-చీమకుర్తి

కొమారదశలో బాలబాలికలు అప్రమత్తంగా ఉండాలని, శారీరక మార్పులపై అవగాహన కలిగి ఉండాలని స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ టిఎల్. కాంతారావు, రిసోర్స్‌పర్సన్ సరళమ్మ తెలిపారు. మండల పరిధిలోని బండ్లమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వభారతి, వద్ది శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సినార్డు సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు హెచ్ఐవి,కౌమారదశలో మార్పులపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సినార్డు పీడీ సునీల్, సిబ్బంది మహేశ్వరి, డేవిడ్, సురేష్, విద్యా కోఆర్డినేటర్ సుబ్బారావు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి- కొత్తపట్నం

కొత్తపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన మంగళవారం నిర్వహించారు. వ్యక్తిగత విభాగంలో 22 మంది, బందవిభాగంలో 38 మంది, ఉపాధ్యాయ విభాగంలో 9 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వ్యక్తిగత విభాగంలో కె.వివేక్ నరసింహ మొదటి బహుమతి, అల్లూరు స్కూల్‌కు చెందిన డి.శ్రీనివాస్ ద్వితీయ బహుమతి సాధించారు. బృంద విభాగంలో పి. ధనలక్ష్మి, హారిక, యశ్వంత్, ఉపాధ్యాయ విభాగంలో కె.రాము బి.తిరుపతయ్య వాసంతి బహుమతులు సాధించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ తులసి కుమారి, పద్మావతి ,ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, న్యాయ నిర్ణయితలు లక్ష్మీకాంతమ్మ , వాసుదేవ మూర్తి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం సబ్ కలెక్టర్‌గా రాహుల్ మీనా

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్



మార్కాపురం సబ్ కలెక్టర్‌గా రాహుల్ మీనా నియమితులయ్యారు. గతంలో ఇక్కడ సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సేతు మాధవన్ రాష్ట్ర ఎంఎంఎస్ఇ కార్పొరేషన్‌కు సిఇఒగా బదిలీ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో రాహుల్ మీనాను సబ్‌కలెక్టర్‌గా నియమించారు.

ఎంఇఒ కార్యాలయం ఎదుట నిరసన

ప్రజాశక్తి-శింగరాయకొండ

జరుగుమల్లి మండలంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బంది పెన్‌డౌన్ చేపట్టారు. అందులో భాగంగా ఎంఇఒ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ శ్రమ దోపిడీ చేస్తున్న ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పటికైనా కాంట్రాక్టు ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాల న్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎసిబికి చిక్కిన సెబ్ సిసి

రూ.7 వేల లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు

ప్రజాశక్తి- ఒంగోలు

ఓ కేసులోని కారును రిలీజ్ చేసేందుకు రూ.7 వేలు లంచం తీసుకుంటూ ఒంగోలు సెబ్ కార్యాలయంలో సిసిగా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ ఫరూక్ అహ్మద్ ఎసిబి అధికారులకు మంగళవారం రెడ్ హ్యాండెడ్‌గా చిక్కాడు. అందిన వివరాల ప్రకారం... ఓ కేసులో సీజ్ చేసిన కారును రిలీజ్ చేసేందుకు ఫరూక్ అహ్మద్ రూ.15 వేలు డిమాండ్ చేశారు.దీంతో కారుకు సంబంధించిన వ్యక్తి గతంలో రూ.8 వేలు ఇచ్చాడు. అయినప్పటికీ కారు రిలీజ్ చేయలేదు. మిలిగిన రూ.7 వేలు ఇవ్వాలని ఫరూక్ అహ్మద్ డిమాండ్ చేస్తున్నాడు. దీంతో విసిగిపోయిన ఆ వ్యక్తి ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. ఎసిబి అధికారుల సూచనల మేరకు రూ.7 వేలు తెచ్చి ఫరూక్ అహ్మద్‌కు ఇస్తుండగా ఎసిబి డిఎస్‌పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

నైపుణ్యాల వెలికితీతకు వేదిక..

స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ : కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

విద్యార్థులలోని నైపుణ్యాలను వెలికితీసేందుకు 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్' ఒక మంచి వేదికని కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ లో భాగంగా స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో సాఫ్ట్ వేర్ ఎడిషన్ గ్రాండ్ ఫినాలే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. వరుసగా రెండవ ఏడాది క్విస్ కళాశాల స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ నిర్వహించడంతో ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 27 బందాలు ఈ సాఫ్ట్ వేర్ హ్యాకథాన్‌లో పాల్గొంటున్నాయన్నారు. వీరు 36 గంటల పాటు నిర్విరామంగా తమకు ఇచ్చిన సమస్యలకు సంబంధించి పరిష్కార మార్గాలను సూచిస్తారన్నారు. ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ పి. సునీల్ మాట్లాడుతూ విద్యార్థులు తమ మేధకు పదును పెట్టి కొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలన్నారు. స్మార్ట్ ఇండియా, డిజిటల్ ఇండియా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలోచనలకు ప్రతి రూపమని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో ఎంతో స్ఫూర్తిని నింపుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హనుమంతరావు, కళాశాల ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సుబ్బారావు, ఏఐసిటిఇ ప్రతినిధి అనిరుథ్, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యాపార రంగంలో రాణించాలి

జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-కొండపి

ఉద్యోగాలు రావని యువత నిరుత్సాహ పరకుండా వ్యాపార రంగంలో రాణించి ఇతరులకు ఉద్యోగాలు ఇచ్చేస్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక పొదిలి రోడ్డులోని గుడిపల్లి చందు కల్యాణ మండపంలో ఎస్‌సి,ఎస్‌టి నిరుద్యోగ యువతకు వ్యాపార రంగంపై దళిత ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(డిక్కి) మరియు జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిక్కి జిల్లా కో-ఆర్డినేటర్ పి.హరిప్రసాద్ అధ్యక్షత వహించారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్‌సి,ఎస్‌టి యువత వ్యాపార రంగం వైపు తమ ఆలోచనలను మార్చుకోవాలన్నారు. ఎస్‌సి,ఎస్‌టి యువతకు బ్యాంకులు కూడా త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిక్కి మాజీ రాష్ట్ర చీఫ్ కో-ఆర్డినేటర్ కాకి ప్రసాదు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాసరావు, ఎపిఐఐసి మేనేజర్ సత్యనారాయణ, ఎల్‌డిఎం అబ్దుల్ రహీం , డిక్కి స్టేట్ ప్రెసిడెంట్ ఆశీర్వాదం, డిక్కి రాయలసీమ జోనల్ ప్రెసిడెంట్ కోలా వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి కారకులైన

ఉపాధ్యాయులపై చర్యలు

రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

విద్యార్థి మృతికి కారకులైన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ తెలిపారు. మార్కాపురం రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కోట్ల రవికిరణ్ గత అక్టోబర్ 4న పాము కాటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. విద్యార్థి తండ్రులు తమకు న్యాయం చేయాలని చేయాలని కోరుతూ ఎస్‌సి కమిషన్‌కు వినతి పత్రం అందజేశారు. దీంతో విచారణలో భాగంగా రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ రాయవరం జిల్లా పరిషత్ పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. విద్యార్థి రవి కిరణ్ మృతికి కారణమైన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులకు మంచి విద్యను నేర్పించాలే తప్ప వారితో పనులు చేయించకూడదన్నారు. ఘటనపై మార్కాపురం సబ్ కలెక్టర్‌ను విచారణ అధికారిగా నియమించినట్లు తెలిపారు. పది రోజుల్లో విచారణ పూర్తి చేసి పూర్తి స్థాయి నివేదిక ఎస్‌సి కమిషన్‌కు సమర్పించాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇఒ సుబ్బారావు, మార్కాపురం డిఎస్‌పి జి.వీర రాఘవరెడ్డి, డిప్యూటీ డిఇఒ.చంద్రమౌళీశ్వరరావు, సిఐ ఆవుల వెంకటేశ్వర్లు, మార్కాపురం పట్టణ, రూరల్ ఎస్ఐలు కోటేశ్వరరావు, వెంకటేశ్వర నాయక్, ఎంపిడిఒ తోట చందన, తహశీల్దారు మంజునాథ రెడ్డి, ఎంఇఒ బి .రాందాస్ నాయక్, ఎపిఒ జీవరత్నం, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రవాణా సదుపాయాల పెంపుపై మాగుంట ప్రశ్న

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

దేశంలో ప్రజా రవాణా మౌలిక సదుపాయాలు, వినియోగం పెంపు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయక మంత్రి కౌశల్ కిశోర్ సమాధానమిస్తూ దేశంలో ప్రజా రవాణా వాటాను ప్రోత్సాహించి మెరుగుపరచటానికి రాష్ట్రాలు, పట్టణాలు, స్థానిక సంస్థలకు సులువుగా ఉండేందుకు '2006 నేషనల్ అర్బన్ ట్రాన్స్ పోర్ట్ పాలసీ' ని కేంద్రం ప్రకటించిందన్నారు. మెట్రో రైల్, పిఎంఇ బస్ సేవ, నేషనల్ ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్ పాలసీలను కేంద్రం జారీ చేసిందన్నారు. దీంతో కేంద్ర, రాష్ట్రాలు సేకరించిన వివరాల ప్రకారం దేశంలో ప్రజా రవాణా వాటా 2019-20 లో కన్నా 2021-22లో పెరిగిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 8,45,80,777 జనాభాకు 2,13,604 బస్సులు ఉన్నాయన్నారు. దేశంలో మొత్తంలో 20 పట్టణాలలో 905 కిలోమీటర్ల మేర మెట్రో రైల్ సౌకర్యం ఏర్పాటు చేశారని, కోటి మంది ఈ రైళ్లలో ప్రయాణిస్తున్నారన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధిపరచటానికి కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్దేశించిన పలు పథకాలు, కార్యక్రమాలు, అమలు చేస్తున్నామన్నారు. అందులో మెట్రో రైల్ పాలసీ, నేషనల్ ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలపమెంట్ పాలసీ, అండర్ బస్ ఫండింగ్ స్కీం, పిఎంఇ బస్ సేవ పథకాలు ముఖ్యమైనవన్నారు. వీటితో జనాభాకు సరిపడిన బస్సులు ఏర్పాటు, మెట్రో రైల్ వ్యవస్థ ప్రణాళికలు, పనుల అమలు, కేంద్ర ఆర్థిక సహాయానికి రాష్ట్రాల ప్రతిపాదనలు, కేంద్ర మార్గదర్శకాలు పొందుట, కేంద్ర ఆర్థిక సహాయంతో ప్రజా రవాణా మౌలిక సదుపాయాలు, వినియోగం అభివృద్ధి చెందుతాయని కేంద్ర మంత్రి తెలియజేశారు.

రియాజ్‌కు సన్మానం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండకు చెందిన పఠాన్ రియాజ్ వైసిపి మైనార్టీ సెల్ జిల్లా సెక్రటరీగా నియమితులయ్యారు. రియాజ్ గతంలో గృహ నిర్మాణ శాఖలో పనిచేశారు. వైసిపి, వరికూటి అశోక్ బాబుపై ఉన్న అభిమానంతో ఉద్యోగాన్ని వదులుకున్నారు. వైసిపిలో పనిచేస్తున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా వైసిపి మైనార్టీ సెల్ జిల్లా సెక్రటరీగా నియమించారు. అందులో భాగంలో వైసిపి నాయకులు మంగళవారం రియాజ్‌ను సన్మానించారు.

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా శింగరాయకొండ లోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. పోలీసు స్టేషన్ ఎదుట మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ టి. శ్రీరాం మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించేలా, వాహనానికి ఇన్సూరెన్స్ చెల్లించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మణ్, అకాడమిక్ డిఎన్ శ్రీనివాసరావు, ఏఒ మధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాలలో పరిశీలన

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

సార్వత్రిక ఎన్నికలకు స్ట్రాంగ్ రూమ్స్, ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్స్, ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి అనువైన ప్రాంతాలను కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్‌పి వకుల్ జిందాల్ మంగళవారం పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియకు అనుబంధంగా నిర్వహించే కార్యక్రమాలకు ఎలాంటి విఘాతం కలగకుండా అధికారులు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, బాపట్ల ఆర్‌డిఒ రవీంద్రర్, డిఎస్‌పి టి.వెంకటేసులు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ వి.సూర్యనారాయణ, బాపట్ల రూరల్ సిఐ వేణుగోపాల్ రెడ్డి, బాపట్ల పట్టణ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.